నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్-ములుగు
సోమవారం ఆగస్టు 05, 2024
www.navatelangana.com

నైపుణ్యాన్ని వెలుకుతీసేందుకు క్రీడలు దోహదం

సీఐ బండారి కుమార్

నవతెలంగాణ-వెంకటాపురం



ఏజెన్సీ గిరిజన యువకుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు దోహదపడతాయని సీఐ కుమార్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ క్రీడా మైదానంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆదివారం సీఐ కుమార్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, సంఘవిద్రోహ చర్యలను యువకులు ప్రోత్సహించరాదన్నారు. యువత చెడు వ్యసనాలకు ఆకర్షితం కావద్దని సూచించారు. 18 జట్లు పోటీల్లో తెలపండి ఉన్నాయి. మొదటి మూడు స్థానాల్లో గెలుపొందిన జట్లు ఏటూరు నాగారంలో జరిగే పోటీలకు అర్హత పొందనున్నాయి. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ డీఎస్పి ప్రశాంత్, ఎస్సై కే తిరుపతిరావు, పిడి నారాయణ, పిఈటిలు హనుమంతు, భార్గవ్ పాల్గొన్నారు.

భద్రకాళి చెరువు ఎఫ్టీఎల్ భూములు భద్రమేనా.!

కబ్జాదారుల చేతుల్లో విలువైన భూములు

నిర్లక్ష్య ధోరణిలో టౌన్ ప్లానింగ్ అధికారులు

తూతూ మంత్రంగా అక్రమ నిర్మాణాల కూల్చివేత

నవతెలంగాణ-వరంగల్

కబ్జాదారులు రోజురోజుకు భద్రకాళి చెరువు ఎఫ్టీఎల్ భూములను దర్జాగా కబ్జాలు చేస్తున్నారని బహిర్గతంగా చర్చ సాగుతుంది. రెవెన్యూ రికార్డు ప్రకారం సర్వే నంబర్ 849, భద్రకాళి చెరువు గతంలో 600 ఎకరాలు ఉండేది. ప్రస్తుతం 336ఎకరాల 37గుంటలు మాత్రమే మిగిలినట్లు రికార్డులో ఉన్నట్లు సమాచారం. సుమారు 263.3 ఎకరాల భూమి భూ కబ్జాదారులు డబ్బును ఎరచూపి ఏకంగా రిజిస్ట్రేషన్లు చేసుకొన్నారు. ఆయా నిర్మాణాలకు బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు మామూళ్ల మత్తులో పడి ప్రభుత్వ భూములను రక్షించాల్సిన వారే నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్నారని పలువురు చర్చించుకోవం గమనార్హం. భద్రకాళి చెరువు ఎఫ్టీఎల్ కింద ఉన్న భూములకు పర్మిషన్ ఇవ్వడం వెనకాల రాజకీయ ఒత్తిళ్ల బలమైన కారణమా లేదా మామూళ్ల మత్తులో పడి అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారులు ఎఫ్టీఎల్ భూములకు పర్మిషన్ ఇచ్చారా అనే అనుమానాలు లేకపోలేదు. గతంలో టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహార శైలిని చూస్తే పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగానే వ్యవహరించారని అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చూసుకొని కొంతమంది భూకబ్జాదారులు ఏకంగా ఎఫ్టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు.కారణాలు ఏమైనాప్పటికీ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల హైకోర్టు ఆగస్టు 5వరకు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేస్తే, హడావుడిగా అక్రమ నిర్మాణాలు చేసిన కొంతమందికి నోటీసులు జారీ చేసి కొన్నింటిని మాత్రమే తూతూమంత్రంగా కూల్చివేసి అక్రమ నిర్మాణాలన్నింటినీ కూల్చివేశామని అధికారులు హైకోర్టులో చెప్పుకునేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.



అశాస్త్రీయంగా భద్రకాళి బండ్...!

భద్రకాళి చెరువు కు సంబంధించిన ఎఫ్టీఎల్ భూములు ఎంత వరకు ఉన్నాయో తెలియడం కోసం గతంలో దిమ్మలను ఏర్పాటు చేశారు. భద్రకాళి బండ్ నిర్మాణాలు సాగుతున్నప్పుడు కొంతమంది భూకబ్జాదారులు వాటిని తొలగించి భద్రకాళి బండ్ చుట్టుపక్కల ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న భూములను అక్రమ నిర్మాణాలు చేసుకున్నారు. వాటిని అరికట్టడంలో బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇది ఇలా ఉంటే కుడా కార్యాలయంలో ఏళ్ల తరబడి ఉన్న అధికారులు కమీషన్ల కోసం ఆశాస్త్రీయంగా భద్రకాళి బండ్ నిర్మాణాల్లో ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండానే నిర్మాణాలు చేపట్టారు. అవి ఇంకా సాగుతున్నాయి. భద్రకాళి బండ్ నిర్మాణాలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు భారీ వర్షం పడితే భద్రకాళి బాండ్ సమీపంలో ఉన్న కాలనీలో ప్రతి ఏటా ముప్పు తప్పడం లేదు. ప్రతి ఏటా బండ్ సమీపంలో ఉన్న పలు కాలనీలు వరద ముప్పుకు గురి అవుతున్నప్పటికీ అధికారులు మాత్రం శాశ్వ త పరిష్కారం చూపడంలో నిర్లక్ష్యం వహిస్తున్నా రని పలువురు ఆరోపిస్తున్నారు. పద్మాక్షమ్మ, హంటర్ రోడ్డు జూపార్క్, బొంది వాగు నుండి వచ్చిన వరద నీరు చెరువులోకి వెళ్లకపోవడంతో ఒకేసారి ఏడు మోరిల వద్ద భద్రకాళి బండ్‌ను తాకడంతో కొంత వరద నీరు భద్రకాళి బండ్‌కు సమీపంలో ఉన్న కాలనీలు వైపు వెళ్లడంతో ప్రతి ఏటా ఆయా కాలనీలు వరద ముంపుకు గురవుతున్నాయి. సంతోషిమాత గుడి పరిసర ప్రాంతాల్లో ఉన్న కాలనీలో సైతం ఇదే దుస్థితి కొనసాగుతుంది. పద్మాక్షి టెంపుల్ ప్రాంతం నుండి గాయత్రి గుడి వరకు పెద్దనాల లేకపోయేసరికి వర్షపు నీరు చెరువులోకి వెళ్లక తిరిగి పరిసర కాలనీలోకి వెళ్లడంతో కాలనీలో నీట మునుగుతున్నాయనీ కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడేళ్ల నుండి ఇదే తంతు కొనసాగుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం వరద ముప్పులో గురైన కాలనీలకు పడవల్లో వెళ్లి ఫోటోలకు ఫోజులు ఇస్తున్నారే తప్ప వరద ముప్పుకు గురికాకుండా శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవట్లేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ ఏడాది కూడా నామమాత్రంగా వరద ముప్పుకు గురికాకుండా చర్యలు చేపడుతున్నప్పటికీ, శాశ్వత పరిష్కారం కాక పోవడంతో అదే తంతు కొనసాగుతుందా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రస్తుత ప్రజా ప్రతినిధులు, కలెక్టర్, బల్దియా కమిషనర్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వరద ముప్పుకు గురికాకుండా చర్యలు చేపట్టాలని, అదేవిధంగా ఏప్రిల్ పరిధిలో ఉన్న భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని పలువురు అనుకుంటున్నారు.

ఎఫ్టీఎల్ హద్దులు ఏర్పాటు చేయాలి : పెరుమల లక్ష్మణ్ (కాశిబుగ్గ)



భద్రకాళి చెరువు ఎఫ్టిఎల్ భూములను బడ నాయకులు, కొంతమంది అధికారుల అండదండలతో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. చాలాసార్లు వినతిపత్రాలు అందజేసినప్పటికీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఇదేతంతు కొనసాగితే భవిష్యత్ తరాలకు భద్రకాళి చెరువు ఎఫ్టీఎల్ భూములు కనుమరుగయ్యే పరిస్థితి ఉంది. గత ఏడాదిలో కూడా భారీ వర్షాలు కురిస్తే పరిసర కాలనీలు నీట మునిగాయి. బఫర్ జోన్‌ను ఏర్పాటు చెయ్యాలి. ఇప్పటికైనా అధికారులు ఎఫ్టీఎల్ హద్దులను ఏర్పాటు చేసి, అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి.

నిప్పు రగిలి ఇల్లు దగ్ధం

-కాలి బూడిదైన వంట సామాగ్రి

-ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

నవతెలంగాణ-నర్సంపేట



నిప్పు రవ్వ రగిలి ఇల్లు దగ్ధమైన సంఘటన చెన్నారావుపేట మండలంలోని జోజిపేట నారాయణతండా గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు అందించిన వివరాల ప్రకారం.. సంద ఈరవ్వ(75) కూలి నాలీ చేసుకుంటూ జీవనాన్ని కొన సాగిస్తుంది. ఇదే తరుణంలో ఆది వారం తనకున్న నామమాత్రపు రేకుల ఇంటిలో వంట పని ముగించు కుంది. అనంతరం ఇంటిలో కరెంటు సమస్య ఉండటంతో బయటకు వెళ్లింది.ఈ క్రమంలో వంట చేసుకొనే కట్టెల పొయ్యిలో మిగిలి ఉన్న నిప్పు రవ్వలు రగలి ఇల్లంతా దగ్ధమై, బట్టలు, వంట సామాగ్రితో సహా రూ.4500 రూపాయలు కాలి బూడిద అయినట్లు తెలిపింది.అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకుంటుంది.

లియాన్‌పాల్‌కు ఎమ్మెల్యే నాగరాజు ఆశీర్వదం

నవతెలంగాణ-కాశిబుగ్గ



గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఈర్ల రాజేందర్ మనవడు, సూర్య పత్రిక రిపోర్టర్ ఈర్ల ఆగస్టిన్ కుమారుడు ఈర్ల లియన్‌పాల్ మొదటి పుట్టిన రోజు వేడుకలకు ఆదివారం వర్ధన్న పేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై ఆశీర్వదించారు. పుట్టినరోజు వేడుకలకు హాజరైన వారిలో స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ , బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు గంద్రతి భాస్కర్, కేతిరి రాజశేఖర్, బిజెపి నాయకుడు ముడుసు నరసింహ, తదితరులు ఉన్నారు.

ఉద్యమకారుడు అశోక్‌కు పరామర్శ

తెలంగాణ ఉద్యమకారుడు పొడిశెట్టి అశోక్‌చారి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాగరాజ్ ఎన్టీఆర్ నగర్‌లోని అశోకాచారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అధైర్య పడవద్దని ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పారా ఒలంపిక్స్ న్యాయనిర్ణీత రాజేందర్‌కు సన్మానం

నవతెలంగాణ- నెక్కొండ



ఫ్యారిస్‌లో జరిగే పారా ఒలంపిక్స్ న్యాయ నిర్ణేతగా బ్యాట్మింటన్ టెక్నికల్ అఫీషియల్‌గా నెక్కొండ పట్టణానికి చెందిన ఫిజికల్ డైరెక్టర్ కొమ్ము రాజేందర్ ఎంపిక కావడం పట్ల యాదవ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఘనంగా సన్మానించారు. నెక్కొండ పట్టణ కేంద్రంలో శ్రీ యాదవ సంఘం తరపున కొమ్ము రాజేందర్‌ను సన్మానం చేశారు. కార్యక్రమంలో నెక్కొండ మాజీ ఉపసర్పంచ్ దేవనమైన వీరభద్రయ్య, బండారి రాజేష్, లంకలపల్లి కుమార్, రాపాక విజేందర్, దిలీప్, కొట్టం దేవేందర్, మాదరబోయిన విజేందర్, బొమ్మన రాకేష్, దొంగల అశోక్, రేగుల అశోక్, పనికర రాజు, సాయిలు పాల్గొన్నారు.

పెద్ది కృషితోనే నర్సంపేటకు మెడికల్ కాలేజీ

సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుల క్షీరాభిషేకం

నవతెలంగాణ-నల్లబెల్లి



నర్సంపేట అభివృద్ధి ప్రదాత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషితోనే నర్సంపేటలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు జరిగిందని నల్లబెల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి అన్నారు. నర్సంపేట ప్రాంతంలో మెడికల్ కాలేజీని తీసుకొచ్చి త్వరలో తరగతులు ప్రారంభం అవుతున్న సందర్భంలో కాలేజీ మంజూరుకు సహకరించిన మాజీ సీఎం కేసీఆర్, వైద్యశాఖ మాజీ మంత్రి హరీష్‌రావు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో బాణాసంచా కాల్చుతూ, స్వీట్లు పంచుతూ సంబరాలను నిర్వహించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు సారంగపాణి మాట్లాడుతూ వరంగల్ జిల్లాలోని నర్సంపేట ప్రాంతాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేసిన, నర్సంపేట పట్టణానికి మెడికల్ కాలేజీ మంజూరు కోసం అహర్నిశలు కష్టపడి తీసుకొచ్చిన ఘనత పెద్ది సుదర్శన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. నర్సంపేట ప్రాంత ప్రజలు కేసీఆర్, పెద్ది సుదర్శన్‌రెడ్డికి రుణపడి ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గందే శ్రీలత శ్రీనివాస్ గుప్తా, క్లస్టర్ ఇన్చార్జులు మోహన్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు క్యాతం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రాజారాం, మోహన్‌రెడ్డి, నరహరి, బొట్ల పవన్, కుమారస్వామి, వీరస్వామి, రవి, వెంకన్న పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఐ(ఎం) జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు

నవతెలంగాణ-ఐనవోలు



ఈ నెల 5,6,7 తేదీల్లో సీపీఐ(ఎం) జిల్లా స్థాయి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు, ఐనవోలు మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య తెలిపారు. ఈ శిక్షణా తరగతులు కాజీపేట పీఎఫ్ ఆఫీస్ దగ్గర కనుకదుర్గ కమ్యూనిటీ హాల్‌లో, ఆర్ఈసీ దర్గారోడ్డు బీమ్‌నగర్ కమాన్ వద్ద నిర్వహించ నున్నట్టు తెలిపారు. శిక్షణా తరగతులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి



వర్ధన్నపేట మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన అన్నారం రామరాజు తండ్రి పెంటయ్య అనా రోగ్యంతో మరణించగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదివారం పరామ ర్శించారు. మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన అమ్మ రాజు కొమ్మాలు విద్యుత్ షాక్‌తో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఉప్పరపల్లిలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉందని పరిష్కరించాలని స్థానికులు కోరగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట వర్ధన్నపేట మాజీ జెడ్పీటీసీ కమ్మగొని ప్రభాకర్ గౌడ్, శ్రీపాద సతీష్, నాంపల్లి యాదగిరి దాడి రాజు మధుకర్, రాజు,రామ్మూర్తి, అనిల్ పాల్గొన్నారు.

సీసీ రవీందర్ కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-నల్లబెల్లి



మండలంలోని మేడపల్లి గ్రామానికి చెందిన సర్ప్ సిసి ఇలాసాగరపు రవీందర్ ఇటీవల మతి చెందిన సంగతి తెలిసినదే. మతుడి కుటుంబ సభ్యులు ఆదివారం దశదినకర్మ నిర్వహించగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సహచర ఉద్యోగులు దశదినకర్మలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సేకరించిన 43,000రవి కూతురుకు ఆర్థిక సహా యంగా అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు గడ్డి అశోక్, సురేష్, లవకుమార్, కొమురయ్య, ఉమ్మడి జిల్లా డిపిఎం చంద్రశేఖర్, ఏపీఎంలు కిరణ్, ధర్మేందర్, వేణుగోపాల్, ప్రేమ్రాజ్, రవీందర్, సీసీలు పద్మ, శ్రీలత, శోభా, శారద, సురేష్, రాజయ్య కష్ణమూర్తి, కట్టయ్య కాంతయ్య, వెంకట్ పాల్గొన్నారు.

మేడారంలో శాశ్వత అభివృద్ధి

పనుల అంచనా ప్రణాళికలను సిద్ధం చేయాలి

రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

నవతెలంగాణ-తాడ్వాయి

మేడారంలో శాశ్వత అభివృద్ధి పనుల అంచనా ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు. ఆదివారం ఐటిడిఏ గెస్ట్‌హౌస్‌లో 2024శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం జాతర ఖర్చులు, మేడారం అభివద్ధి కార్యక్రమాలపై సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఐటిడిఏ పి.ఓ. చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. శ్రీజ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్ జీ, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ కే. సత్యాపాల్‌రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో క్యూలైన్స్ పై షెడ్స్ నిర్మాణం చేపట్టాలని, గిరిజన పూజారుల నుంచి అభ్యంతరాలు తలెత్తితే వారికి అర్థమయ్యేలా పీపీటీల ద్వారా వివరాలను ప్రదర్శించాలని తెలిపారు. వర్షాకాలం తర్వాత అక్టోబర్ మాసం నుంచి పనులు సాఫీగా జరుగుతాయని తెలిపారు. అధికారులంతా సమన్వయంతో జాతర విశిష్టత తెలియజేసేలా పని చేయాలని సూచించారు. మేడారం జాతరకు వచ్చే భక్తులకు అణువణువునా సమ్మక్క సారమ్మ దేవతల ఆధ్యాత్మిక కనబరిచేలా ఈ ప్రాంతాన్ని రూపొందించాలని, జంపన్న వాగు పరిసర ప్రాంతాలను కూడా అభివద్ధి చేయాలని, మేడారం జంపన్న వాగు పరివాహక ప్రాంతం చుట్టూ చెట్ల పెంపకం, పార్క్స్, హట్స్ ఏర్పాట్లకు సంబంధించి సలహాలు సూచనలు అందించాలని తెలిపారు.

రైతులకు మొక్కలు చెట్ల పంపిణీ

మేడారంలోని పగిడిద్దరాజు, గోవిందరాజు భవన్‌ల వద్ద రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలు పెరిపిగా పెంచడం వలన పర్యావరణం సమతుల్యత ఏర్పడి వర్షాలు బాగా పడి పంటలు పండుతాయి అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు లో చేనుల గట్ల పైన వీలున్న ప్రతి చట మొక్కలు నాటాలన్నారు.

కళ్యాణ్ లక్ష్మి చెక్కుల పంపిణీ

మేడారంలోని గెస్ట్‌హౌస్‌లో మంత్రి సీతక్క 20మంది లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద విద్యార్థులకు 3,62,598 రూపాయల చెక్కుల పంపిణీచ 11మంది నిరుపేద విద్యార్థులకు ప్రవేశ రుసుము ప్రయాణ ఖర్చులు సీటు కేటాయింపు రుసుము, మెస్ డిపాజిటివ్ అడ్మిషన్ ఫీజుల అవసరాల కొరకు రూ.3 లక్షల 62 వేల598 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం



ఈ నెల 5వ తేదీ నుండి 9 వ తేదీ వరకు ఐదు రోజులు నిర్వహించనున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో అధికారులు అద్భుతంగా విధులు నిర్వహించి మొక్కలు నాటాలని సూచించారు. మంచిగా విధులు నిర్వర్తించిన ప్రత్యేక అధికారికి స్వాతంత్ర దినోత్సవం రోజు సత్కరించడం జరుగుతుందని తెలిపారు. ములుగును ఆదర్శవంతమైన జిల్లాగా తీర్చిదిద్దాలని మంత్రి కోరారు.

గత జాతరలో ప్రభుత్వం రూ.110 కోట్లతో అభివృద్ధి

గత జాతర ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం 110 కోట్ల రూపాయలు కేటాయించిందని, వాటిలో సివిల్ వర్క్స్ కు 66 కోట్లు, జాతర నిర్వహణకు 24 కోట్లను ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. మరో 20కోట్ల రూపాయలను ఇప్పుడు జరిగే అభివృద్ధి పనుల కోసం ఉంచామని, బడ్జెట్ సమావేశాలలో ఐటిడిఏ బడ్జెట్ నుంచి మరో 50కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని, వాటిని కూడా శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

నేషనల్ హైవే ను సమ్మక్క సారలమ్మ కారిడార్‌గా అభివృద్ధి

మన జాతీయ రహదారి సమ్మక్క సారలమ్మ కారిడార్లుగా చేయాలని, వివిధ ప్రాంతాలలో పార్కింగ్ స్థలాలలో జిల్లాలలోని పర్యాటక కేంద్రాలు చారిత్రాత్మక ప్రదేశాల గూర్చి తెలిసేలా, వచ్చే పర్యాటకులను భక్తులను ఆకర్షించే విధంగా చిహ్నాలు, థీమ్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాకు వచ్చే పర్యాటకులు ఎక్కువగా ప్లాస్టిక్ వినియోగిస్తున్నారని రాబోయే రోజుల్లో ప్లాస్టిక్ నిషేధం పై ఒక ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసి ప్లాస్టిక్ర రహితంగా ఏర్పాటు చేస్తామని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మల్సూర్, ఆర్‌బ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేష్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్‌కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ఎండోమెంట్ ఈఓ రాజేందర్, మండల ప్రత్యేక అధికారి డీఎం అండ్ హెచ్ఓ అప్పయ్య, జిల్లా పర్యటక శాఖ అధికారి సూర్య కిరణ్, తాడ్వాయి తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో, సుమనవాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టాలి

ఏఎస్పీ శివమ్‌ఉపాధ్యాయ

వాలీబాల్ క్రీడల్ని ప్రారంభించిన ఏఎస్పీ

నవతెలంగాణ-ఏటూరు నాగారం (ఐటీడీఏ)



డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టి మాదక ద్రవ్యాలకు యువత అలవాటు పడకుండా యువతను కాపాడుకోవాలని ఏటూరు నాగారం ఏ ఎస్పీ శివమ్ ఉపాధ్యాయ అన్నారు. ఏటూరు నాగారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఆది వారం మండల స్థాయి వాలీ బాల్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ క్రీడల టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వాలీబాల్ క్రీడలను ప్రారంభించి క్రీడాకారులను ఉద్దేశించి ఏఎస్పీ మాట్లాడారు. సామాజిక స్ప హతో డ్రగ్స్ సరఫరాను, వాడ కాన్ని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల వ్యక్తుల జీవితాలే కాకుండా ఆయా కుటుంబాలు, దేశం, సమాజం ప్రమాదంలో పడుతుందన్నారు. డ్రగ్స్ వాడకాన్ని అరికట్టడంలో విద్యార్థులు సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. డ్రగ్స్ తీసుకున్నా, విక్రయించినా శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్. రెండో ఎస్సై రమేష్, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు దావూద్ పాల్గొన్నారు.

ఊకే జగన్ మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు

గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవిందనాయక్

దశదినకర్మకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ -తాడ్వాయి



మండలంలోని లింగాల ఏజెన్సీలో ఆదివాసి బిడ్డ ఊకె జగన్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవిందనాయక్ అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దండుగుల మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ రామ సహాయం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయ కులు కార్యకర్తలతో కలిసి జగన్ దశదిన కర్మకు హాజరై చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘ టించారు. వారి కుటుంబాన్ని ఓదార్చారు. జగన్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇంద్రారెడ్డి, మహిళా నాయకురాలు సామ నాగక్క, నాయకులు పాయం నరసింహారావు, మాజీ సర్పంచ్ ఊకే మోహన్ రావు, చేలా సారయ్య, ఊకె నాగేశ్వరరావు కోరం చంద్రయ్య, ఎర్రయ్య, సమ్మయ్య, కాంతారావు, వెంకటయ్య, రామారావు, సీతారాములు, బుచ్చి రాములు, నర్సయ్య, వెంకన్న, ప్రశాంత్, కాంతారావు పేడకట్లు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేటి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా నేడోక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5నుండి 9వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి జిల్లా నుండి ప్రజలు ఫిర్యాదులు ఇచ్చుటకు కలెక్టరేట్ కార్యాలయానికి రాకూడదని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

ఎకో టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తాం

రాష్ట్ర దేవదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ-వరంగల్

ఖిలా వరంగల్ ప్రాంతాన్ని ఎకో, టెంపుల్ టూరిజంగా అభివద్ధి చేస్తామని అందుకు ప్రణాళికలు రచించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యుఎంసి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే, జిల్లా అటవీ శాఖ అధికారి అనుజ్ అగర్వాల్‌తో కలిసి కొండా సురేఖ ఖిలా వరంగల్‌లోని రాతికోట ఉత్తర ద్వారం, ఏకాశీల క్రీడా మైదానం, అగర్త చెరువు మత్తడి, అగర్త చెరువు, లక్ష్మీపత్రి గండి త్రికుటాలయాన్ని, పురావస్తు శాఖ మ్యూజియం, శంభుని గుడి ప్రాంతాలను పరిశీలించి ఏకో టూరిజంతో పాటు టెంపుల్ టూరి జంగా అభివద్ధి చేసేందుకు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వరంగల్ రాతికోట ద్వారం వద్ద నిలిచిన వర్షపు నీరును పరిశీలించి, నీరు నిలవడానికి కారణాలు అధికారులతో తెలు సుకొని నిల్వ ఉండకుండా సాంకేతికపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అగర్తల చెరువును పరిశీలించి చెరువు సుందరికరణ, బోటింగ్, ఫిషింగ్, లైటింగ్ తదితర ఏర్పాటుకు సమగ్ర ప్రణాళికలు చేయాలని మంత్రి అన్నారు.ఖిలా వరంగల్‌లో నిర్మించిన కమ్యూనిటీ హాల్ పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కమ్యూనిటీ ప్రజల సౌకర్యార్థం అదనంగా మొదటి అంతస్తు నిర్మించుటకు చర్యలు తీసుకోవాలని జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్‌ను మంత్రి సూచించారు. పురాతన కట్టడాలు చెట్లు, పిచ్చి మొక్కలతో పేరుకుపోయి వాటి ఆకారం కనబడడం లేదని వెంటనే జంగల్ క్లియరెన్స్ చేయించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.ఈ సందర్భంగా పురావస్తు శాఖ మ్యూజియంలో పరిశీలించిన మంత్రి, పెండింగ్ నిధులు ప్రభుత్వం నుండి మంజూరు చేయిస్తామని, యుద్ధ ప్రాతిపదికన ఇంకనూ మిగిలి ఉన్న పనులను పూర్తిచేసి రాష్ట్ర ముఖ్యమంత్రి సెప్టెంబర్ 9న జిల్లాకు రాక సందర్భంగా ప్రారంభించుటకు సిద్ధం చేయాలన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పురాతన కాలం నాటి కట్ట డాలను పరిరక్షించడం తో పాటు ఖిలా



వరంగల్ ప్రాంతానికి పూర్వ వైభవం తీసుకువచ్చి భక్తు లను, పర్యాటకులను ఆకర్షిస్తూ, ప్రభుత్వ ఆదా యం పెరిగేలా అభివద్ధి పరుస్తామన్నారు. ఖిలా వరంగల్ చుట్టుప్రక్కల ఉన్న కాకటియుల కాలం నాటి 20 గుళ్లను పునరుద్ధరణ చేసి పర్యాటకులు దైవ దర్శనం చేసుకునేలా దేవదాయ శాఖ ద్వారా అభివద్ధి చేస్తామని, అయ్యగార్లను కూడా నియమిస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు పడావు పడకుండా ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా అభివద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన నిధులను రాబట్టుకొంటూ, కేంద్ర ప్రభుత్వం నుండి కూడా రావాల్సిన నిధులను సేకరించి ఈ ప్రాంతాన్ని అభివద్ధి చేస్తామన్నారు. వన మహోత్సవంలో భాగంగా వరంగల్ కోటలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను కోరారు. అనంతరం మంత్రి శంభుని దేవాలయంలో అర్చకులు మంత్రిచే ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఆలయంలోని పలు సమస్యలు సిబ్బంది మంత్రి దష్టికి తీసుకురాగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు బైరబోయిన ఉమాదామోదర్ యాదవ్, భోగి సువర్ణ సురేష్, ఓని స్వర్ణలత భాస్కర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కష్ణవేణి, కుడా ప్రాజెక్ట్ అధి కారి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
సోమవారం ఆగస్టు 5, 2024
www.navatelangana.com



నేటి నుంచి సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణా తరగతులు

పార్టీ మండల కమిటీ సభ్యులు ఓరుగంటి సాంబయ్య

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

ఈ నెల 5,6,7తేదీల్లో కాజీపేట మండలంలోని పీఎఫ్ ఆఫీస్ రోడ్డు భీమ్‌నగర్ కనుకదుర్గ ఫంక్షన్‌హాల్‌లో జరిగే సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని పార్టీ మండల నాయకులు ఓరుగంటి సాంబయ్య పిలుపునిచ్చారు. కాజీపేట మండల కమిటీ సభ్యులు సంటి రవి అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాంబయ్య మాట్లాడుతూ కాజీపేట మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతులకు, హన్మకొండ జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఎంపిక చేయబడిన నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు అలీ, మల్లేశం పాల్గొన్నారు.

జీవితంలో స్నేహం గొప్ప అనుబంధం

శ్రీ మిత్ర మండలి వెల్ఫేర్ సొసైటి అధ్యక్షుడు ఆకుతోట రమేష్

నవతెలంగాణ-హసన్‌పర్తి

జీవితంలో ప్రతి వ్యక్తికి ఎంత సంపాదన ఉన్నా స్నేహం ఒక గొప్ప అనుబంధమని శ్రీ మిత్ర మండలి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ మేరీ స్కూల్‌లో స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీమిత్ర మండలి వెల్ఫేర్ సొసైటీ, 1988-89 ఎస్ఎస్‌సీ బ్యాచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా అధ్యక్షుడు ఆకుతోట రమేష్ హాజరై కేక్‌కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా సంఘ సభ్యులందరూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొని ఆత్మీయతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అప్పని శంకర్, ప్రధాన కార్యదర్శి బెనికి సురేష్, కోశాధికారి గడ్డం వెంకటేశ్వర్లు, గడ్డం రవీందర్, మాటేటి కుమారస్వామి, పెద్దమ్మ కిషోర్, కామారపు బాలకష్ణ, గోపరాజు బిక్షపతి, మేకల ప్రకాష్, పోలం కుమారస్వామి, అప్పని రవిశంకర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

317జీవోను ఇబ్బందులు పడుతున్న

ఉద్యోగులను సొంత జిల్లాలకు బదిలీ చేయాలి

నవతెలంగాణ-సుబేదారి

317జీవోతో బదిలీ అయి ఇబ్బంది పడుతున్నఉద్యోగులను తిరిగి సొంత జిల్లాకు బదిలీ చేయాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండమల్ల రవి ఆధ్వర్యంలోహైదారాబాద్‌లో చీఫ్ కమిషనర్ ఆఫ్ లాండ్ అడ్మినిస్ట్రేషన్‌కు కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని జిల్లాలలో గిర్దావర్, ఎంఆర్ఐ, ఏఆర్ఐలుగా పోస్టింగ్‌లు ఇచ్చి వారిని, జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి వద్ద క్యాంప్ క్లర్క్‌లుగా డిప్యూటేష న్ పేరుతో తీసుకోవడం వలన మండల స్థాయిలో ఒక్కరే గిర్దావర్‌గా పని చేయడం వలన పనిభారం ఎక్కువగా ఉన్నందున క్యాంప్ క్లర్క్‌లుగా వేరే ఉద్యోగులను నియమించాలని అన్నారు. సాధారణ బదిలీలకు ఈ నెల 31 వరకు గడువు ఉన్నందున వీఆర్ఏ నుండి పదోన్నతి పొందిన వారిని స్వంత మండలాల నుండి వెంటనే బదిలీచేసి పక్క డివిజన్ లకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర గౌరవాధ్యక్షులు మాచుపెల్లి శేఖర్, ప్రధాన కార్యదర్శి పట్టల విజయ్ బాబు, ఉపాధ్యక్షులు కాసర్ల శ్రీనివాస రావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శులు పెండ్లి రంజిత్, మహ్మద్ గౌస్, వరంగల్ జిల్లా కోశాధికారి మార్త కష్ణస్వామి, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రమేష్, జగామ ఉపాధ్యక్షులు మహ్మద్ ఖదీర్ ఖాన్ లు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

హామీలను మరిచిన మోడీ ప్రభుత్వం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

దేశంలో పేదల ధనాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను మోడీ ప్రభుత్వం మరిచిపోయిందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు వీరమల్ల రంజిత్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీలో ఆయన మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు కనీసం ప్రభుత్వ యూనివర్సిటీలలో చదువుకుందాం అంటే సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాధనాన్ని మొత్తం ప్రైవేట్ కార్పొరేట్ శక్తులు ఆదానీ అంబానీలకు కట్టబెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలను పరిష్కరించి, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

నవతెలంగాణ-నడికూడ

మండలంలోని చౌటుపర్తి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం తీర్పు స్వాగతిస్తు కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఓదెల రవి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం పాలాభిషేకం చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు నియమించిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇవ్వడం హర్షనీయమని, కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో దుప్పటి సమ్మయ్య, బూత్ అధ్యక్షులు సంగి రాజకుమార్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దుప్పటి పవన్, దుప్పటి జర్జీ, దుప్పటి యాకుబ్, దుప్పటి నాగయ్య, ల్యాదల్ల మొగిలి, దుప్పటి జంపయ్య, వేల్పుల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, నడికుడ మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్ మలహాల్‌రావు, మండల యూత్ అధ్యక్షులు అప్పం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పద్మాక్షిదేవి ఆలయంలో కుడా చైర్మన్ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి కుటుంబ సమేతంగా హన్మకొండలోని చారిత్రాత్మకమైన స్వయంభూలింగం దక్షిణ కాశిగా పేరుగాంచిన సిద్దేశ్వర స్వామి వారిని 12వ శతాబ్దంకి చెందిన పద్మాక్షి దేవి అమ్మ వారిని, శ్రీ భద్రకాళి అమ్మ వారిని ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆ స్వామి, అమ్మ వార్ల ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు.

ఘనంగా చౌడేశ్వరి మాతా జయంతి

నవ తెలంగాణ-హసన్‌పర్తి

మండల కేంద్రంలోని చౌడేశ్వరి మాత ఆలయంలో ఆదివారం దేవాంగుల కుల దైవం చౌడేశ్వరి మాత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆది పరాశక్తి చౌడేశ్వరి అమ్మ వారి జయంతి వేడుకల్లో దేవాంగ కుల సభ్యులు, మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో కుల సంగం అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సంగ సభ్యులు బెనికి సురేష్, లిక్కి రవికుమార్, వెంకటేశ్వర్లు, పొలస సురేష్, మేడం ప్రభాకర్, పిటిమి ప్రభాకర్, ఉమాశంకర్, మేడం సాంబయ్య, నాగేందర్, వెంకటేష్, ఆలయ పూజారి మటం రాజేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ పాఠశాలకు విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-నడికూడ

రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు గత నెలలో జరిగిన ఈవెంట్స్‌లలో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించి రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ పాఠశాలకు నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న గూడూరు అయాన్ కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అయాన్ కుమార్ కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, మండల విద్యాశాఖ అధికారిని రమాదేవి, మండల నోడల్ ఆఫీసర్ హనుమంతరావు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నూతి వేణుగోపాలస్వామి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కందికట్ల రమ, విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టరేట్‌లో లిఫ్ట్ వద్ద పెచ్చులు ఊడే ప్రమాదం

నవతెలంగాణ-సుబేదారి

హనుమకొండ కలెక్టరేట్‌లో లిఫ్ట్ దగ్గర పెచ్చులు ఊడే ప్రమాదం ఉంది. కొత్తగా నిర్మాణం చేపట్టిన కలెక్టరేట్ భవనం పెచ్చులూడే దశకు రావడం, మెట్ల దగ్గర టైల్స్ ఊడిపోవడంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం ప్రజలు, ఉద్యోగులు, కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు. అయితే ఇప్పటి వరకు ఏ ప్రమాదం సంభవించకపోయినప్పటికీ పెచ్చులు ఊడి పడే ప్రమాదం పొంచి ఉండటం, టైల్స్ ఊడిపోవడంతో వెంటనే మరమ్మతులు చేయాలని కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజలు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే లిఫ్ట్ దగ్గర ప్రతిక్షణం ఎవరో ఒకరు నిలబడి ఉంటారు, అది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఒకవేళ అది కూలితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో పాటు సెల్లార్‌లో పై కప్పు వాటర్ లీకేజీ అవుతుందని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై 'నవతెలంగాణ' కలెక్టరేట్ ఏవో సత్యనారాయణను వివరణ కోరగా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి మరమ్మతు చేయిస్తామని తెలిపారు.



భూ కబ్జాదారుల అక్రమాలను అరికట్టాలి

కేయూ పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితుల ధర్నా

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

పేదల భూములపై కన్నేసిన భూకబ్జాదారుల అక్రమాలను అరికట్టాలని 166ప్లాట్స్ ఓనర్ కుటుంబాలను ఆదుకోవాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ముందు బాధితులు ధర్నా చేపట్టారు. ముస్లిం ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్మే గఫూర్, సెక్రటరీ మీర్జా ఫర్ తుల్లా బేగ్ మాట్లాడుతూ హన్మకొండ రెవెన్యూ మండల పరిధిలోని రెడ్డిపురంకు సంబంధించిన భూమిని 1982లో ముస్లింలు, ఇతర కులస్తులు పెంటారెడ్డి బాలిరెడ్డి, జోజిరెడ్డి వద్ద 166మంది కొనుగోలు చేశామని తెలిపారు. అప్పుడే రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నామని, 20ఏండ్ల తర్వాత ఇప్పుడు ప్రగతి అసోసియేట్స్ మేనేజింగ్ పార్ట్‌నర్‌మెంట్ రామిరెడ్డి, రాగిడి రవీందర్‌రెడ్డి, మర్రి జనార్ధన్‌పటేల్ తప్పుడు పత్రాలతో పాస్‌బుక్ చేసుకుని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై గతంలో పోలీసు కమిషనర్ వద్దకు బాధితులమంతా కలిసి వెళ్తే విచారణ జరిపి కేసులు కూడా నమోదు చేశారని తెలిపారు. సీపీ రంగనాథ్ వరంగల్ నుంచి బదిలీ కావడంతో మళ్లీ ప్రగతి అసోసియేట్స్ వాళ్ల రౌడీలతో భయాభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఏ ఆలీమ్, మహమ్మద్ బాబా షర్ఫుద్దీన్, లచ్చన్న రాజమహే సునీల్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రపురి కాలనీని అభివృద్ధి చేస్తా

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

నవతెలంగాణ-హసన్‌పర్తి

గ్రేటర్ 1వ డివిజన్ పరిధి మంత్రపురి కాలనీని మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హామీ ఇచ్చారు. గ్రేటర్ 1వ డివిజన్ పరిధి మంత్రపురి కాలనీ, కాకతీయ కాలనీలలో ఎమ్మెల్యే నాగరాజు పర్యటించి స్వయంగా కాలనీవాసులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రపురి కాలనీ, కాకతీయ కాలనీ వాసులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి వినతిపత్రం అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో కాలనీలో స్మశాన వాటిక, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కాలనీలలో డ్రై, సీసీ రోడ్లు సారిగా లేక వర్షాకాలంలో ప్రజలు నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి కూడా లేదని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతన పనులు పూర్తి చేసి కాలనీలలో సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ 1వ డివిజన్ అధ్యక్షుడు చిర్ర నరేష్‌గౌడ్, సీనియర్ నాయకుడు దేవరకొండ అనిల్, గడ్డం శివరాం ప్రసాద్, అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మంత్రపురి కాలనీ, కాకతీయ కాలనీల అధ్యక్షులు, కాలనీల కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



కల్లుగీత కార్మికులు హక్కుల కోసం పోరాడాలి

కేజీ కేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లుగౌడ్

మేడారంలో అమరుల యాధిలో యాత్ర ప్రారంభం

మంత్రి సీతక్కకు సమస్యలపై వినతి

నవతెలంగాణ-తాడ్వాయి

అమరులను యాది చేసుకొందాం.. హామీలను అమలు చేయమని అడుగుదాం.. హక్కులకై పోరాడుదాం అని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. ఆదివారం మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల సన్నిధిలో కల్లుగీత కార్మిక అమరుల యాధి యాత్రలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పులి నరసయ్యగౌడ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు గౌడ్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఏజెన్సీలో కల్లుగీత వత్తి చేస్తున్న గీతా కార్మికులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను ఇవ్వాలని ఈనెల 18న జరిగే పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 2నుంచి 18 వరకు కల్లుగీత కార్మిక అమరుల యాది యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు.

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కల్లుగీత వత్తి చేస్తున్న కార్మికులందరికీ సేఫ్టీ మోకులు, టూవీలర్ బైకులు ఇవ్వాలని, వత్తిలో ప్రమాదాలకు గురైన కార్మికులకు ఇచ్చే మెడికల్ బోర్డు సర్టిఫికెట్ జారీలో నిబంధనలను సులబతరం చేయాలన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని, ప్రతి జిల్లా కేంద్రంలో కల్లు నీరా కేంద్రాలను ప్రారంభించాలని అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ప్రభుత్వమే ప్రతిష్టాపన చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమాలు నిర్వహించిన బొమ్మగాని ధర్మ బిక్షం, ఎస్సార్ దాట్ల, తొట్ల మల్సూర్, బైరు మల్లయ్య, దోరి కనకయ్య, పులి మల్లయ్య, పొన్నం భాస్కర్ గౌడ్, బుర్ర నాంపల్లి, నాగపురి సాంబయ్య, బొంబోతుల ముత్తయ్య, కారు పోతుల మల్లయ్య స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవి గౌడ్, కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి పొన్నం సంతోష్‌గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ పులి సంపత్‌గౌడ్, మాజీ ఎంపిటిసి బత్తిని రాజు గౌడ్, తమ్మల సమ్మయ్య గౌడ్, గడ్డం శ్రీధర్ గౌడ్, తండాల శ్రీనివాస్ గౌడ్, ఏనుగందుల మొగిలిగౌడ్, ఎనగంటి మొగిలి, బొమ్మగాని రవీందర్, ఎరుకలి గోవిందరాజు గౌడ్, కాల్వల సమ్మయ్య గౌడ్, కాటాపూర్ మాజీ సర్పంచ్ పులి పెద్ద నరసయ్య గౌడ్, పులి రవి గౌడ్ ,గండు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేత

గీత కార్మికుల సమస్యలను పరిష్కారాన్ని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గీతా కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మేడారం వచ్చిన మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా గీత కార్మికుల సమస్య గురించి వివరించారని, దీన్ని మంత్రి సీతక్క అసెంబ్లీలో గీతా కార్మికుల సమస్యలపై సమస్య లేవనెత్తి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దష్టికి తీసుకెళ్లి గీతా కార్మికుల సమస్యలకు పరిష్కారం వెంటనే పరిష్కరించాలని కోరారు.



ట్రెంగ వరంగల్ ప్రధాన కార్యదర్శిగా మార్త కృష్ణస్వామి

నవతెలంగాణ-సుబేదారి

ట్రెంగ వరంగల్ ప్రధాన కార్యదర్శిగా మార్త కృష్ణ స్వామిని నియమించినట్లు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండమల్ల రవి తెలిపారు. రవి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు మరుపట్ల మల్లయ్య అధ్యక్షతన హనుమకొండ, వరంగల్ జిల్లాల సంఘం సభ్యులతో హనుమకొండలోలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నడికూడ మండల గిర్దావర్ లావుడ్య హేమనాయక్‌ను సంఘంలోకి ఆహ్వానించారు. వరంగల్ జిల్లా గౌరవాధ్యక్షునిగా గట్టికొప్పుల రాంబాబు, ప్రధాన కార్య దర్శిగా ప్రస్తుతం ఉన్న నాలిక ఆనంద్‌కుమార్ తన ఆరోగ్యం సహకరించనందున తన పదవికి న్యాయం చేయలేనని తెలిపినందున వారి స్థానంలో మార్త కృష్ణస్వామిని ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భూక్య నర్సింహ నాయక్, రాష్ట్ర కోశాధికారి మహ్మద్ సలీంపాషా హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రమేష్, కోశాధికారి పులుసారి దామోదర్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటుక ఐలయ్య, వర్ధన్నపేట సీనియర్ సహాయకులు రమేష్, హనుమకొండ జిల్లా సివిల్ సప్లై సీనియర్ సహాయకులు సదానందం, దామెర జూనియర్ సహాయకులు మురళి, అయినవోలు మండల జూనియర్ సహాయకులు, ఉద్యోగులు రమేష్, సాంబరాజు, రమేష్ పాల్గొన్నారు.



కుంటపై పూర్తిస్థాయి హక్కు కల్పించాలి

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని కొంకపాక గ్రామంలో ఆదివారం మత్స్యకారులు కొంకాలమ్మ కుంటపై తమకు పూర్తిస్థాయి హక్కు కల్పించాలని కోరారు. ఆదివారం మత్స్యకారులు మీడియాతో మాట్లాడుతూ తాము వృత్తిలో భాగంగా గ్రామంలోని కుంటలో చేపలు పెంచుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని, ఈ క్రమంలో ఆదివారం మూడెత్తుల తండాకు చెందిన గిరిజనులు తమను అడ్డగించి కుంటపై తమకు హక్కు లేదంటూ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు ఎదురైతే తహసీల్దార్లకు, కలెక్టర్లకు వినతిపత్రాలు కూడా ఇచ్చామని తెలిపారు. అప్పుడు స్పందించిన అధికారులు తమకు కుంటపై హక్కు కల్పిస్తూ ఆర్డర్ కాపీ కూడా అందజేశారని, అయినప్పటికీ గిరిజనులు మాత్రం దౌర్జన్యం చేస్తూ తమను అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తమకు కుంటపై పూర్తిస్థాయి హక్కు కల్పించి జీవనాధారం చూపించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు దేవేందర్, అల్లాడి ఎల్లస్వామి, దయాకర్, గోదారి దేవేందర్, మహేందర్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఐనవోలు

భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం ఆదివారం ఐనవోలు మల్లికార్జున దేవస్థానంలో నిర్వహించారు.ఈ సమావేశానికి హన్మకొండ జిల్లా సహాయ కార్యదర్శి నర్రా నరేందర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా బీఎస్ఆర్‌కేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే అలీ, తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ హన్మకొండ జిల్లా ఇన్‌చార్జి పంకెర్ల కుమారస్వామి యాదవ్ హాజరై మాట్లాడారు. అనంతరం ఐనవోలు మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హనుమకొండ జిల్లా అధ్యక్షులు మూలవీర నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా మొటక సత్యం, ఉపాధ్యలుగా నీరటి కుమారస్వామి, పాషా, జన్ను సారయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇండ్ల క్రిష్ణ, కార్యదర్శులుగా కట్కూరి చంద్రమౌళి, ముంజ మల్లేశం, జట్టబోయిన ప్రభాకర్, ప్రచార కార్యదర్శులుగా లింగాల లక్ష్మన్, కాయిత రాజు, కోశాధికారిగా గుండె శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా పిట్టల సాంబయ్య ఎన్నికయ్యారు.

నేటి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-సుబేదారి

స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం ఉన్నందున హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే సోమవారం ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

చెరువును నింపాలని కడియంకు వినతి

నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని మడిపల్లి నుంచి ధర్మసాగర్ వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని, గ్రామంలోని గండు చెరువులోకి నీటిని నింపాలని కోరుతూ మడిపల్లి మాజీ సర్పంచ్ చిత్ర సుమలతావిజయ్ కుమార్‌తో కలిసి గ్రామస్తులు స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాచర్ల మహేందర్‌గౌడ్, జంపాల రమేష్, జక్కుల రవీందర్, గాదం శ్రీధర్, ముంజ జలంధర్, బుర్ర సదానందం, గ్రామస్తులున్నారు

ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-నయీమ్‌నగర్

స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హనుమకొండ బ్లడ్‌బ్యాంకులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి స్నేహితులు పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పుల్లారు వేణుగోపాల్ మాట్లాడుతూ ఒకరి రక్తదానంతో ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చని, రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అనంతరం రక్తదానం చేసిన వారిని అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. రక్తదానం చేసిన వారిలో ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు సుదర్శన్,అబ్దుల్ గఫర్, రాజేష్, రవీందర్, శివశంకర్, శ్రీధర్, రాజమౌళి, మనోహర్‌రెడ్డి, విఠల్, వంశి, రెడ్‌క్రాస్ డాక్టర్ మరియు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం

మాజీ సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య

నవతెలంగాణ-శాయంపేట

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని మాజీ సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య అన్నారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసే బదిలీపై వెళ్లిన నాగశ్రీకి బదిలీ సన్మాన కార్యక్రమం ఆదివారం మాజీ సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమై పని చేసినప్పుడే అధికారులకు తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. కార్యదర్శిగా నాగశ్రీ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆమెను పూలమాల, శాలువా, మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బోడకుంటి సురేష్, మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు విరమణ

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

హనుమకొండలోని అంబేద్కర్ జితేందర్‌సింగ్ నగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ఐదు రోజులుగా స్థానికులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఆదివారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ ఆ దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే నాయిని రాజేంద్రరెడ్డితో వీడియో కాల్ ద్వారా దీక్ష చేస్తున్న ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అర్హులైన పేదలకు కచ్చితంగా నెలరోజుల లోపలే పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే స్పష్టమైన హామీతో నిరాహార దీక్షను తోట పవన్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన రెడ్డి సంఘం నాయకులు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని ఆదివారం రెడ్డి సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నీట్ ఎంబిబిఎస్ కౌన్సిలింగ్‌లో 10శాతం ఈడబ్ల్యూఎస్ కోట తక్షణం అమలు చేయాలని, ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పాడి గణపతిరెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షులు వీసం సురేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి ఎడెల్లి రాజిరెడ్డి, సంయుక్త కార్యదర్శి వెలుగటి రాజిరెడ్డి, ప్రముఖ చార్టెడ్ అకౌంట్ తిప్పర్తి రాఘవరెడ్డి, తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనికి వేం నరేందర్‌రెడ్డి స్పందించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

రేవంత్‌రెడ్డి నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలి

మహ్మద్ సిరాజ్‌కు క్రీడా మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్

రాష్ట్ర హైకోర్టు ఛీఫ్ జస్టిస్‌కు లేఖ, విచారణకు డిమాండ్

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇండియన్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్ 1 ఉద్యోగాలు ఇవ్వడంపై విద్యార్థి నిరుద్యోగులు స్పందించారు. విద్యార్హతలు లేకపోయినా ఉద్యోగం ఇస్తామని స్వయంగా సీఎం ప్రకటించడం అన్యాయమన్నారు. ఇది విద్యార్థి నిరుద్యోగులను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిరుద్యోగ యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం డిగ్రీ పాస్ కాకపోయినా, ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకోకపోయినా ఉద్యోగం ఇవ్వడం ఎలా సమంజసమని ప్రశ్నిస్తూ రాష్ట్ర హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు.ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలో మీడియా సమావేశం సమావేశంలో డిఎమ్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు దూడపాక నరేష్, టిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కన్నం సునీల్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మండి పడ్డారు. రాజ్యాంగం లోని ఏ అధికరణ ముఖ్యమంత్రికి గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చే అవకాశం కల్పించిందని నిలదీశారు. అవసరమైతే సిరాజ్, నిఖత్ జరీన్‌కు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్‌గా నియమించాలని, అవసరమైతే ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవించాలన్నారు. డిగ్రీ కూడా పూర్తి చేయని వారు జిల్లా స్థాయిలో గ్రూప్ 1 ఉద్యోగం ఎలా చేయగలరో చెప్పాలన్నారు. రెండు ఉద్యోగాల వల్ల సుమారు వంద మంది నిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు.ఈ అభ్యర్థనను రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా పరిగణించి వెంటనే ప్రభుత్వ వివరణ కోరి, గ్రూప్ 1 ఉద్యోగాలను వెనక్కి తీసుకొని, అర్హులైన,పరీక్ష రాసిన నిరుద్యోగ యువతకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఠాగూర్, వెంకట్, నాని, మోహన్, నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ

నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ చేపట్టగా రోడ్డు పక్కన ఉన్న అతి తక్కువ నీడివి గల శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను ఆదివారం విద్యుత్ సిబ్బంది తొలగించారు. వాటి స్థానంలో పొడవాటి విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను కూడా తొలగించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేశారు.దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లైన్మెన్ సంతోష్, జేఎల్ఎం విష్ణు, విద్యుత్ సిబ్బంది అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

6వ తేదీన గద్దర్ ప్రథమ వర్ధంతి సభ

నిర్వహణ కమిటీ సభ్యులు గాజర్ల అశోక్



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

ఆగస్టు 6న జిల్లా కేంద్రంలో గద్దర్ యాది సంస్మరణ సభను విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ సభ్యులు గాజర్ల అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో గద్దర్ యాది మొదటి వర్ధంతి నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో గాజర్ల అశోక్ మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన ఆట పాటలతో కీలక పాత్ర పోషించి తెలుగు ప్రజలలో చిరస్మరణీయుడిగా నిలిచారని అన్నారు. ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ అన్న యాదిని స్మరించుకుంటూ మొదటి వర్ధంతి సభ ఆగస్టు 6న జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అయిత ప్రకాశ్ రెడ్డి హాజరవుతారని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గద్దర్ మొదటి వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు అజ్మీర జంపన్న, ముద్దమల్ల భార్గవ్, కుంభం రమేష్, అన్నయ్య, శ్రీరాములు, శివరాజ్, పైడిపల్లి రమేష్, ముంజల రవీందర్, భూమయ్య, చంద్రయ్య బండి, సుదర్శన్, పుట్టపాక తిరుపతి, భూంపల్లి రాజు, కుమ్మరి అశోక్, పూల శ్యామ్, గడ్డం కొమురయ్య మధు, శారద, రేణుకా, రమేష్, ఉమా, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే


సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

నవతెలంగాణ-గణపురం

పేదల పక్షాన పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీ లేనని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ పాఠశాల ఆవరణలో సీపీఐ రెండవ మండల మహాసభ ఘనంగా నిర్వహించారు. మండల కార్యదర్శి జి విజేందర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాజుకుమార్ హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నిత్యం పోరాటాలు నిర్వహిస్తున్నది సీపీఐ అని అన్నారు. అసెంబ్లీలో కూడా పేదల పక్షాన, సంఘటిత అసంఘటిత రంగాలపైన గొంతెత్తి మాట్లాడేది తమ పార్టీనేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. గణపురం మండల ప్రజల సమస్యలపై ఈ మహాసభలో పోరాట కార్యక్రమాలను రూపొందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్, కొరిమి సుగుణ, తాళ్ల పోషం, భాస్కర్, ఇంజంపల్లి శంకర్, సుధాకర్, సదానందం, కొమురయ్య, జగ్గు నాయక్, సాయి, నగేష్, కృష్ణ, నీలా, ప్రమీల, రవళి, భారతి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన యువకుడు

సొంత ఖర్చుతో కుళాయి గద్దె నిర్మాణం





నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రమైన తాడిచెర్లలోని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి కోసం వేసిన పైప్ లైన్‌లో భాగంగా సిటీపల్లె ఏడవ వార్డులో ప్రజలకు తాగునీటి సరఫరా కోసం కుళాయి ఏర్పాటు చేశారు. కానీ కుళాయి డ్రైనేజీలో ఉండడమే కాకుండా, కుళాయి చుట్టూ మహిళలు నీరు పట్టకుండా డ్రైనేజీ నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురైయ్యేవారు. మురుగును తొలగించి కుళాయి వద్ద గద్దె నిర్మాణం చేయాలని వార్డు ప్రజలు కొన్నేళ్లుగా పంచాయతీ పాలకులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని శేనం నిఖిల్ అనే యువకుడు స్పందించి తన సొంత ఖర్చులతో కుళాయి వద్ద గద్దె నిర్మాణం చేపట్టి మానవత్వం చాటుకున్నాడు. దీంతో పలువురు నిఖిల్‌ను అభినందించారు.


'జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలి'

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడాలని, జర్నలిస్టుల హక్కులను కాపాడాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్(టిఎస్‌జేయు) నాయకులు కోరారు. బీహార్ రాష్ట్రం సాసారమ్ జిల్లా కేంద్రంలోని గోపాల్ నారాయణ విద్యాలయ ప్రాంగణంలో శని, ఆదివారాల్లో జాతీయ అధ్యక్షులు అశోక్ మాలిక్, సెక్రటరీ జనరల్ సురేష్ శర్మ, జాతీయ ఉపాధ్యక్షులు నారగౌని పురుషోత్తం ఆధ్వర్యంలో నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్‌యుజె (ఇండియా) జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం నుండి తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్(టిఎస్‌జెయు) రాష్ట్ర అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్‌కుమార్, జాతీయ నాయకులు పావుశెట్టి శ్రీనివాస్, జయశంకర్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శి జల్దీ రమేష్, పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో జర్నలిస్టులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, వారికీ ఇండ్లు నిర్మించాలని కోరారు. జర్నలిస్ట్ హెల్త్ కార్డు లు పరిమితి నిబంధన లేకుండా అన్ని కార్పొరేట్ ఆసుపత్రిలో అమలయ్యేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. జర్నలిస్ట్ పిల్లలకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాల, కళాశాలల్లో 50శాతం ఫీజు రాయితీ కల్పించాలన్నారు. వేతన కమిటీ సిఫార్సులు అమలు చేసి 60సంవత్సరాలు పైబడిన జర్నలిస్ట్‌లకు పింఛన్ అమలు చేయాలన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం జర్నలిస్ట్ చట్టాలను కఠినంగా అమలు చేయాలని, ప్రతి జిల్లాలో అట్రాసిటీ కమిటీ ని అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్‌యుజె(ఐ)అనుబంధ సంఘాల 29 రాష్ట్రాల ప్రతినిధులు, టీఎస్‌జెయు జాతీయ నాయకులు చిర్రగోని ఉదయ ధీర్, దొంత సత్యం తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన కోటగుళ్ళు

నవతెలంగాణ-గణపురం




కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోట గుళ్ళు శ్రావణ మాస ఉత్సవాలకు ముస్తాబయింది. శ్రావణ మాస ఉత్స వాలను పురస్కరించుకొని నెలరోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగనున్నాయి. శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం, సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సోమవారం నుండి సెప్టెంబర్ 2 వరకు పూజా కార్యక్రమాలు కొనసాగుతాయి. శ్రావణమాస ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ విజ్ఞప్తి చేసింది.

నవతెలంగాణ-మహాదేవపూర్

నేటి నుండి నెలరోజుల పాటు శ్రావణమాసం ప్రారంభం మొదలు కావడంతో అన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. ముఖ్యంగా శ్రీ కాళేశ్వరం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసేవారు రూ.6000 రసీదు తీసుకొని పూజలో పాల్గొనాలని దేవస్థానం అధికారులు తెలిపారు. ఇప్పటికే అనేక మంది అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్నారని తెలిపారు. నెలరోజులపాటు ప్రత్యేక పూజల సందర్భంగా అదనంగా పూజారులను నియమించినట్టు తెలిపారు. కాళేశ్వరం దేవస్థానంతో పాటు మహాదేవపూర్, బొమ్మాపూర్ బెగులూరు అంబటిపల్లి గ్రామాల వెలిసిన దేవాలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ వద్ద పెరుగుతున్న వరద

నవతెలంగాణ-మహాదేవపూర్



తెలంగాణ, మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు మహాదేవపూర్ మండల పరిధి కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో గోదావరి ప్రాణహిత నదులకు వరద ప్రవాహం పోటెత్తి ఆదివారం మేడిగడ్డ బ్యారేజీకి 4లక్షల87వేల10 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు 85 గేట్లు ఎత్తి అదే స్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు. అన్నారం బ్యారేజీ కి నీటి ప్రవాహం రావడంతో 66 గేట్లు ఎత్తి అదేస్థాయిలో నీటిని వదులుతున్నారు. వర్షాల కారణంగా వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉండడంతో పరిసర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 9.5 నుంచి 10 మీటర్లకు చేరుకుందని, ప్రవాహం కొనసాగుతుందని సిడబ్ల్యూసి సిబ్బంది తెలిపారు.

పల్లె పోరుకు సమాయత్తం



- ఆశావహుల్లో నూతనోత్తేజం

నవతెలంగాణ-మల్హర్‌రావు

పంచాయతీ ఎన్నికలు సాధ్యమైనంత త్వరగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుండగా అందుకు అనుగుణంగా అడుగులు వేగంగా పడుతున్నాయి. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లకు అధికారులు సమాయత్తం అవుతుండగా గ్రామాల్లో ఆశావహుల్లో సందడి నెలకొంది.

రాష్ట్రంలో బీసీ జనగణన పూర్తయ్యాక ఎన్నికలు నిర్వహిస్తారన్న ప్రచారం జరిగింది. అంతలోనే ప్రత్యేక అధికారులను నియమించడంతో ఎన్నికలు కనీసం ఆరు నెలల పాటు వాయిదా పడతాయన్న దిశగా పార్టీలు ఆలోచించాయి. ఇదే తరుణంలో ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో పార్టీలు అప్రమత్తమయ్యాయి పోటీ చేయాలన్న ఆలోచనలో ఉన్న ద్వితీయ స్థాయి నాయకులు మద్దతు దారులతో సమాలోచనలు జరుపుతుండటంతో గ్రామాల్లో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది.

జాబితా తయారీకి ఏర్పాట్లు..

కేంద్ర ఎన్నికల సంఘం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఓటరు జాబితా ఇప్పటికే అందింది. దీని ఆధారంగా జిల్లా పంచాయతీ అధికారులు ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. ఇందుకోసం ఈ నెల 3 నుంచి ప్రతి జిల్లా నుంచి ఎంపిక చేసిన ఆపరేటర్లకు హైదరాబాద్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో శిక్షణ ఇస్తున్నారు. తొలుత వార్డుల మ్యాపింగ్, వార్డుల వారీగా ఓటర్ల జాబితా రూపొందించేందుకు ప్రక్రియపై శిక్షణ ఇవ్వనున్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎసీ?స్టలను జనాభా ప్రాతిపదికన, బీసీలకు ఓటర్ల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసింది. రిజర్వేషన్లను అయిదేళ్ల నుంచి పదేళ్లకు పెంచుతూ చట్ట సవరణ చేసింది. ప్రస్తుత ప్రభుత్వం యథాతథంగా అమలు చేస్తే ఎన్నికలు త్వరలోనే జరిగే అవకాశాలు ఉంటాయి. కాగా మల్హర్‌రావు మండలంలో మొత్తం పంచాయతీలు 15 ఉండగా అందులో కొత్తవి 5, పాతవి 10 ఉన్నాయి.

రిజర్వేషన్లపై సందిగ్ధం...

పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. గత ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల అమలులో కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ వర్తించేలా గత ఎన్నికల సందర్భంగా నూతన పంచాయతీ రాజ్ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టానికి అనుగుణంగానే ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నట్లుగా చర్చలు జోరందుకున్నాయి. మరోవైపు బీసీ జనగణన చేపట్టి గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండు ఉన్న నేపథ్యంలో కొంత సందిగ్ధం నెలకొన్నప్పటికీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నెల మొదటి వారంలోనే ఓటరు జాబితా సిద్ధం చేయాలని సీఎం తాజాగా ప్రకటించడం, సెప్టెంబరు చివరి వారంలో ఎన్నికలు జరగనున్నట్లు వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో ఎన్నికల నగారా త్వరలోనే మోగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

డ్రగ్స్ నిర్మూలనకు డీవైఎఫ్ఐ పాదయాత్ర

- విజయవంతం చేయాలి
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



గంజాయి నిర్మూలనకు డీవైఎఫ్ఐ పాదయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కలిసి డ్రగ్స్ నిర్మూలన గోడపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భూపాలపల్లి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నంలో ప్రజ లందరూ భాగస్వాములు కావాలని అన్నారు. గంజాయి, డ్రగ్స్ వాడకం పెరుగుతుందని, దాని నిర్మూలనకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 120 కిలోమీటర్ల పాదయాత్ర చేయడం అభినందనీయమని అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ చేస్తున్న పాదయాత్రను యువకులు, ప్రజలు ఆదరించి డ్రగ్స్ నిర్మూలనకు కదలాలని సూచించారు. అనంతరం డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూక్య నవీన్ ఆత్మూరు శ్రీకాంత్ మాట్లాడుతూ.. డీవైఎఫ్ఐ చేపడుతున్న పాదయాత్ర ప్రారంభ సభలో పాల్గొనాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును ఆహ్వానించామని తెలిపారు జిల్ల ప్రజలు, మేధావులు, యువకులు, విద్యార్థులు డీవైఎఫ్ఐని ఆదరించి పాదయాత్ర విజయవంతానికి ఆర్థిక సహాయ సహకారాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యంగ్ మెన్స్ జిల్లా కన్వీనర్ గడ్డం కవిత, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పనికిరా రజిత, బంధు సుజాత, జిల్లా కమిటీ సభ్యులు అజ్మీర సరిత, బుర్ర సాతి, ఎర్ర సుజాత, రాజేష్, అప్సర్, నాయకులు రాజేందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



బదిలీ పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలోని బదలీపై వెల్తున్న ఏడుగురు పంచాయితీ కార్య దర్శులకు మండల అభివద్ధి కార్యాలయ సిబ్బంది ఘనంగా శాలువాలతో సన్మానించారు. బదిలీపై వెళ్లిన వారిలో వల్లెం కుంట కార్యదర్శి నరేష్, ఇప్పలపల్లి కార్యదర్శి సరిత, నాచారం కార్యదర్శి రమేష్, కొండంపేట కార్యదర్శి కుమార స్వామి, దుబ్బపేట కార్యదర్శి ప్రవీణ్, కొయ్యూరు కార్యదర్శి ప్రసాద్, చిన్నతూండ్ల సమ్మరాజ్ లు బదలీ కావడంతో వారికి శాలువతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు తెలిపారు. నూతనంగా విధుల్లో చేరిన పంచాయితీ కార్యదర్శులు దేవేందర్ రెడ్డి, చరత్ చంద్ర, రజిత, సంపత్ లకు స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ చింతలపల్లి మలహల్ రావు, ఎంపీడీఓ శ్యాంసుందర్, ఎంపీఓ విక్రమ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ ఆదిత్య, సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శులకు సన్మానం

నవతెలంగాణ-మల్హర్‌రావు



మండల పరిధఙ వళ్లెంకుంట, కొండంపేట, చిన్నతూండ్ల గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కొన్నేండ్లుగా ప్రజలకు సేవలందించి బదిలీపై వెళుతున్న కర్ణకంటి నరేష్, బంటు సమ్మరాజు,మారుపాక కుమారస్వామిని ఆదివారం వళ్లెంకుంట గ్రామ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సత్కారం చేశారు. అనంతరం వారికి జ్ఞాపకార్థంగా వారి చిత్రపటాలు అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ-చిట్యాల



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన టీజీపీఎస్‌సీ ఫలితాల్లో చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్ 2014-2015 విద్యా సంవత్సరానికి చెం దిన గూడెపు వర్షిత, పుట్టపాక నిరంజన్, బుర్ర వినీల్ భరద్వాజ్ ఏకఉలుగా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆదివారం వారిని పాఠశాల కరస్పాం డెంట్ మహమ్మద్ రాజ్ మహమ్మద్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు 1990లో స్థాపించిన తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు 34 సంవ త్సరాలుగా ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగులుగా, సాఫ్ట్వేర్ ఉద్యోగస్తులుగా స్థిరపడ్డారని అన్నారు. టీజీపీఎస్ ఫలితాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు సంపా దించడం తమ పాఠశాలకు గర్వ కారణమని అన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగాలని ఆకాంక్షించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అఫీజ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొయ్యూరు రేంజర్‌గా రాజేశ్వర్‌రావు

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలోని కొయ్యూరు అటవిశాఖ రేంజర్ గా జి.రాజేశ్వర్రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది రేంజర్‌కు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన రేంజర్ కిరన్ కుమార్ ఆల్లపల్లికి బదలీ అయ్యారు. హుజురాబాద్ నుండి బదలీపై వచ్చిన రాజేశ్వర్‌రావు కొయ్యూరు రేంజర్‌గా బాధ్యతలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-గణపురం

మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన ఉమ్మడి కొండా పూర్ మాజీ సర్పంచ్ గంధం ఓధాకర్ తండ్రి గంధం బక్కయ్య అనారో గ్యంతో శనివారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని భూ పాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట భూపాలపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలుసాని లక్ష్మీ నరసిం హరావు, పార్టీ మండల అధ్యక్షులు మోతె కరుణాకర్‌రెడ్డి, సీనియర్ నాయ కులు ఐలోని రామచంద్రారెడ్డి కొండాపూర్ మాజీ ఎంపీటీసీ మంద అశోక్‌రెడ్డి, సీతారాంపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు వైనాల వెంకటేష్, ఉపాధ్యక్షులు శివరాత్రి గణేష్, ఎల్లబోయిన భద్రయ్య, నాయకులు లక్ష్మీనారాయణ, తది తరులు పాల్గున్నారు.



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అంబటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక

నవతెలంగాణ-మహాదేవపూర్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అంబటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక అన్నారు. పలిమెల మండలం గుత్తి కోయ గూడెం, ముకునూరు గ్రామ గుత్తి కోయగూడెం గ్రామాల్లో వాగులు, వంకలు దాట డాక్టర్ మౌనికతో పాటు మరో ముగ్గురు వైద్యులు వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేసారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు. అనంతరం ఆయా గ్రామాలలో ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మౌనిక మాట్లాడుతూ ఎవరికైనా అనారోగ్య లక్షణాలుంటే సమీపంలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఇంటి పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అత్యవసర వైద్య సేవల కోసం 108ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రఘురామన్, విజయకుమార్ ఏపడమాలజిస్ట్ భాషనాయక్, హెచ్ ఈఓ సోనాజీ, సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, లావణ్య, పుష్ప పద్మ, నాగలక్ష్మి, సరస్వతి, శ్రీలత, ఆశాలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన

నవతెలంగాణ-మహాదేవపూర్



మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామంలో ఆదివారం ప్రజలకు సైబర్ నేరాలు, నూతన చట్టాల పట్ల కాళేశ్వరం ఎస్ఐ చక్రపాణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. లారీ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. వాహన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటా

- కాంగ్రెస్ యూత్ రాష్ట్ర నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు

నవతెలంగాణ-మల్హర్‌రావు/కాటారం




ప్రతి యూత్ కార్యకర్తకు అండగా ఉంటామని,మంథని నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వాలు చేయించాలని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ యూత్ రాష్ట్ర నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు పిలుపునిచ్చారు. కాటారం మండలంలో ధన్వాడ గ్రామంలోని ఐటి,పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వగృహంలో ఆదివారం మంథని నియోజకవర్గ స్థాయి యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశం జరిగింది. శ్రీను బాబు హాజరై మాట్లాడుతూ.. రానున్న యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో మంథని నియోజకవర్గ పరిధి లోని 10 మండలాల, మంథని నియోజకవర్గ సంబంధించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్ష బరిలో ఉన్న అభ్యర్థులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించాల న్నారు. అభ్యర్థులు ఆగస్టు 5 నుండి సెప్టెంబర్ 5 వరకు జరగనున్న యువజన కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని అన్నారు. రాష్ట్రంలోనే మంథని నియోజకవర్గాన్ని అత్యధిక సభ్యత్వాలు చేసి రాష్ట్రం లోనే మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

- మహాదేవపూర్ సీఐ

నవతెలంగాణ-మహాదేవపూర్



సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని సీఐ రామచంద్రరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని అన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస అవుతున్నారని, డ్రగ్స్, గుడుంబా ఇతర మత్తుకు లోనై విలు వైన జీవితాన్ని, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి భవిష్యత్‌లో రాణించాలని అన్నారు. ఈ సం దర్భంగా సోషల్ మీడియాలో వస్తున్న మెసేజ్‌లకు స్పందించకుండా సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని అన్నారు. మావోయిస్టులకు సహకారం అందించిన ఆశ్రయం కల్పించినా నేరమని అన్నారు. ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకుని నేరాలు, చెడు అలవాట్లుకు దూరంగా ఉండి ఉన్నతమైన జీవితాన్ని గడపాలని కోరారు.

అంధకారంలో కుమ్మరివాడ.. పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-మల్హర్‌రావు



మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలోని ఒకటవ వార్డు (కుమ్మరివాడలో) గత నెల రోజులుగా విధి ద్వీపాలు లేకపోవడంతో అంధకారంగా మారిందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో రాత్రింబవళ్లు ప్రజలు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. రాత్రివేలలో పాములు, తేళ్లు తదితర విష పురుగులు, జంతువులు సమాచారం చేస్తాయని, ప్రమాదవశాత్తు ఏమైనా జరిగితే బాధ్యులు ఎవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ అధికారులకు విన్నవిస్తే విద్యుత్ అధికారులకు చెప్పాలని, విద్యుత్ అధికారులకు విన్నవిస్తే పంచాయతీ అధికారులకు చెప్పాలని ఒకరిపై ఒక్కరూ చెబుతున్నారు తప్ప ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్, పంచాయతీ అధికారులు సంయుక్తంగా వార్డులో విద్యుద్ధీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఎంపీడీఓ కార్యాల యం ఎదుట ఆందోళన చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



ఫర్టిలైజర్ అసోసియేషన్ ఆర్థికసాయం

నవతెలంగాణ-పాలకుర్తి

పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో పాలకుర్తి గ్రామానికి చెందిన శ్రీ మంజునాథ ఫెర్టిలైజర్ వ్యాపారి సలేంద్ర సోమశేఖర్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం పాలకుర్తి మండల ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు అడ్డూరి భూపాల్ రావు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బత్తుల వెంకన్న, నజీర్ కలిసి సోమశేఖర్ కుటుంబానికి రూ.21000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భూపాల్‌రావు మాట్లాడుతూ సోమశేఖర్ మృతి ఫెర్టిలైజర్ అసోసియేషన్కు తీరని లోటని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఫెర్టిలైజర్ యజమానులు ఆత్మహత్యలకు పాల్పడరాదని సూచించారు. రైతులకు పెట్టిన పెట్టుబడులు రాబట్టుకునేందుకు కృషి చేయాలి తప్ప ఆత్మహత్యలతో సమస్య పరిష్కారం కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెర్టిలైజర్ అసోసియేషన్ డీలర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కేబిఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొండి వెంకటరెడ్డి చేయూత

నవతెలంగాణ-బచ్చన్నపేట

బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన చిన్ననాటి బాల్యమిత్రుడు రాగిచెట్టి ముత్తయ్య తల్లి రాగిచెట్టి లక్ష్మమ్మ అనారోగ్యంతో మరణించింది. ఆదివారం బాధిత కుటుంబాన్ని కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొండి వెంకటరెడ్డి పరామర్శించి రూ.5000 ఆర్థికసాయం అందించారు. అలాగే వారం రోజుల కిందట మరణించిన టేకులపల్లి యాదమ్మ, కూరాకుల ఎల్లమ్మ బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అనంతరం కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొండి వెంకటరెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మన ఆంజనేయులు, అల్వాల ఎల్లయ్య, పైసా బిక్షపతి, అల్వాల నర్సింగరావు, కర్రే వెంకటయ్య, యాదగిరి, కూరాకుల సుభాష్, కూరాకుల రవి, కర్రే లక్ష్మయ్య, రాజు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి అండగా బాల్యమిత్రులు

నవతెలంగాణ-పాలకుర్తి

స్నేహితుడికి అండగా బాల్యమిత్రులు నిలిచారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం 1984-85 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు బాల్య మిత్రుడికి అండగా నిలిచారు. మండలంలోని తొర్రూరు గ్రామానికి చెందిన లొంక మల్లేష్ తో పటు అతని భార్య సాంబలక్ష్మి దంపతులిద్దరూ పక్షవాతంతో బాధపడుతూ ఐలోని మండలం పూనేలు గ్రామ శివారులో గల శ్రీ కనకదుర్గ వృద్ధాశ్రమంలో ఉంటుండగా మాజీ జెడ్పిటిసి పుస్కూరి శ్రీనివాసరావు, వెలమ సంక్షేమ సంఘం జిల్లా డైరెక్టర్, లయన్స్ క్లబ్ ఆఫ్ పాలకుర్తి మాజీ అధ్యక్షుడు వీరమనేని సోమేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ చిట్యాల యాకయ్యలతోపాటు చిన్ననాటి బాల్యమిత్రులు ఆర్థిక సహాయాన్ని అందజేసి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధాశ్రమంలో ఉంటున్న ప్రతి ఒక్కరికి పండ్లు బ్రెడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో చారగొండ్ల సదానందం, సిహెచ్ లింగమూర్తి, బెల్లం రత్నాకర్, జీడి మనోహర్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా మిత్రులు

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలం లోని నెల్లుట్ల గ్రామంలో సమాజంలో అన్నిటి కన్నా గొప్పది స్నేహం అని అకాలమరణం చెందిన మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచారు. నెల్లుట్ల గ్రామానికి చెందిన డప్పు రవి ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా 2005-06 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు ఆదివారం రూ.20వేలు సాయం చేశారు. రవి కూతురు పేరుమీద పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్ డిపాజిట్ చేసి వారి కుటుంబానికి మేమున్నాం అంటూ భరోసా ఇచ్చారు.

డీసీసీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డిని కలిసిన ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రమేష్



నవతెలంగాణ-లింగాలఘనపురం

జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని ఆదివారం ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నర్సింగ రమేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. వారితోపాటు మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి సోమవారం గ్రీవెన్స్‌సెల్ : తహసీల్దార్

నవతెలంగాణ-కొడకండ్ల



ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ చంద్రమోహన్ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినం చేసుకోవాలని కోరారు.



ఘనంగా స్నేహితుల దినోత్సవం

స్నేహితుల దినోత్సవం సందర్భంగా మహాదేవపూర్ సూరారం ఇతర ప్రాంతాలలో ఆదివారం ఘనంగా స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. పాత జ్ఞాపకాలునెవరు వేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ-మహాదేవపూర్

అన్ని బంధాలు కంటే స్నేహబంధం గొప్పది

- పీఏసీఎస్ చైర్మెన్ పులిగిల్ల పూర్ణచందర్



నవతెలంగాణ-బచ్చన్నపేట

అన్ని బంధాల కంటే స్నేహబంధం గొప్పదని పీఏసీఎస్ చైర్మెన్ పులిగిల్ల పూర్ణచందర్ అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని బచ్చన్నపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తేలు కంటి మురళి అధ్యక్షతన స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం పూర్ణచందర్ మాట్లాడుతూ మండల జర్నలిస్టులు సంఘటితంగా సమన్వయంతో మరింత ముందుకు సాగాలన్నారు. ప్రజా సమస్యల పట్ల మంచి కథనాలు రాసి ప్రజలను మరింత చైతన్యవంతులుగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు ముశిని వీరగౌడ్, ఉపాధ్యక్షులు తేలుకంటి శ్రీనివాస్, రెడ్డబోయిన హరికుమార్, మంచాల సంతోష్, కోశాధికారి గంట తిర్మల్ రెడ్డి, సభ్యులు జంగిలి బిక్షపతి, మేకల శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్, బాల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సవాల్‌గా వరుస దొంగతనాలు !

- ముసుగు దొంగల హల్‌చల్
- భయాందోళనలో ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలి
- పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-పాలకుర్తి

పాలకుర్తి మండలంలో వరుస దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారింది. రెండు నెలల వ్యవధిలో సుమారు ఆరు దొంగతనాలు జరుగగా అందులో రెండు దొంగతనాలు గత మూడు రోజుల క్రితం జరిగాయి. . ఆదివారం మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన బట్టు ఆగమ్మ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి ఆగమ్మ కండ్లకు గంతలు కట్టి నగలుతోపాటు సెల్‌ఫోన్ దొంగిలించారు. ఒంటరిగా నివసించే మహిళలను దొంగలు ముస్కు ధరించి దొంగతనాలకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ గట్ల మహేందర్ రెడ్డి, ఎస్సై మోడం సాయి ప్రసన్న కుమార్ లు బాధితురాలి నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇంతకు ముందు దొంగతనాలకు పాల్పడిన దొంగలను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చాకచక్యంగా పట్టుకున్నారు. దొంగతనాలను ప్రజలు మరువకముందే గత మూడు రోజుల క్రితం పాలకుర్తిలో, ఆదివారం బొమ్మెరలో దొంగతనాలకు పాల్పడడం పోలీసులకు సవాల్‌గా మారింది

వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఒంటరిగా నివసిస్తున్న వ్యక్తులను దొంగలు టార్గెట్ చేయడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయంతో బిక్కు,బిక్కుమంటున్నారు. బంగారు ఆభరణాలు ధరించి ప్రజలు ఒంటరిగా ఉండరాదని, కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, దొంగతనాలను నివారించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

గ్రామాల్లో స్థానిక సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

గ్రామాలలో ఉన్న స్థానిక సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకుకనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఇప్పగుడెం గ్రామంలో ఆదివారం మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శుల సమావేశం గట్ల మల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా కనకారెడ్డి హాజరై మాట్లాడుతూ గ్రామాలలో స్థానిక సమస్యలు పేరుకపోయి ఉన్నాయని, వర్షాలు పడడంతో వీధులు శుభ్రత లేక మోరీలలో నీరు నిలువడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. అయినా అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. గ్రామాలలో పరిపాలన పూర్తిగా అస్తవ్యస్తంగా ఉందని ఆరోపించారు. పేరుకే స్పెషల్ ఆఫీసర్లు ఉన్నారని ఇప్పటి వరకు గ్రామాలలో సమస్యలు పరిష్కరించేది లేదన్నారు. రోడ్లు గుంతలు పడి అధ్వానంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం పరిశీలించి జిల్లాలోని గ్రామాలలో అధికారులతో సర్వే చేయించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే మండల తహసీల్దార్ కార్యాలయాలు, జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ



కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, మండల కార్యదర్శి మునిగెల రమేష్, జిల్లా కమిటీ సభ్యులు కొడెపాక యాకయ్య, మండల గ్రామ నాయకులు కుర్ర ఉప్పలయ్య, చిలుముల్ల భాస్కర్, మంద మహేందర్, దైద రాములమ్మ, పోలాసు పరమేష్, యార మోహన్, వంగపండ్ల సోమయ్య తోడెంగల ఐలయ్య, పోలాసు కిష్టయ్య, రామగోని సతీష్, పిట్టల శ్రీను, సట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



నవతెలంగాణ - స్టేషన్‌ఘనపూర్

తల్లిపాలలో ఎన్నో పోషక విలువలు ఉంటాయని బిడ్డ మనుగడకి తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్ వైజర్ దివ్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని నమిలిగొండ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ ఎం సుజాత ఆధ్వర్యంలో తల్లిపాల విశిష్టతను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పౌష్టికాహారం గురించి వివరించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటే బిడ్డ ఆరో గ్యంగా ఉంటుందన్నారు. తల్లి పాల ద్వారా బిడ్డలో రోగ నిరోధక శక్తి పెరుగు తుందని తద్వారా పిల్లలు అనారోగ్యం బారిన పడకుండా ఉంటారన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్త గంగం ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ శర్మ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పరామర్శ

నవతెలంగాణ-దేవరుప్పుల

మండలంలోని పెద్దమడురు గ్రామ పురోహితుడు మూటకోడూరు శ్రీనివాస్ శర్మ గుండెపోటు ఇటీవలే మరణించాడు. విషయం తెలుసుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదివారం మృతుడు శ్రీనివాస్ శర్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గణేష్, సీనియర్ నాయకుడు తోటకూరి పాండు కృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ ఆకవరం రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బోనగిరి నరసింహ, నారెడ్డి సైదుల్ రెడ్డి, మండల గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా...

- రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- యూరియా కొరత ఉందంటూ దుష్ప్రచారం
- తొర్రూరు సొసైటీ చైర్మెన్ మైసిరెడ్డి

నవతెలంగాణ-పాలకుర్తి

రైతులకు అందుబాటులో సరిపడా యూరియా ఉందని తొర్రూరు సొసైటీ చైర్మన్ గోనె మైసిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తొర్రూరు సొసైటీ పరిధి గ్రామాలతో పాటు పాలకుర్తి సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులకు యూరియా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. యూరియాతోపాటు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మండలంలో యూరియాతోపాటు ఎరువుల కొరత ఉండరాదనే లక్ష్యంతో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, అధికారులను అప్రమత్తం చేశారని తెలిపారు. సెలవు రోజులను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తొర్రూర్ సొసైటీ పరిధిలో గల గ్రామాలకు మూడు లారీల యూరియా దిగుమతి అయ్యేలా చర్యలు చేపట్టారని తెలిపారు. యూరియా కొరత ఉందంటూ కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని, వారి దుష్ప్రచారాన్ని రైతులు నమ్మరాదని కోరారు. రైతులు కోరినంత యూరియా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మొదటి రెండో విడత రుణమాఫీలో పాలకుర్తి సొసైటీ పరిధిలో 439 రైతులకు మూడు కోట్ల 50 లక్షల రూపాయలు రుణమాఫీ జరిగిందని తెలిపారు. 121 మంది రైతులకు కొత్తగా పంట రుణాలు అందించామని తెలిపారు. రుణమాఫీ కోసం వచ్చిన రైతులతో యూరియా కొరత ఉందంటూ దుష్ప్రచారం చేయించడం దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో మాసంపల్లి రణధీర్, సిబ్బంది రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

పత్తి పంటతో పాటు వరి సాగుకు సరిపడా యూరియా మండలంలో అందుబాటులో ఉందని



మండల వ్యవసాయ శాఖ అధికారి కాకి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పాలకుర్తి తొర్రూరు సొసైటీలలో 140 టన్నులు, ఎరువుల డీలర్లు ఆగ్రోస్ కేంద్రాల్లో 2 టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందని తెలిపారు. రైతులకు సరిపడా యూరియా అందించడమే లక్ష్యమన్నారు. రైతులెవరు ఆందోళన చెందరాదని సూచించారు.

పెచ్చరిల్లుతున్న కుక్కల స్వైర విహారం !

గాయాలపాలై మృతి చెందుతున్న బాధితులు ! రాబిస్ దాడిలో ఎడ్జర్లలో ఇద్దరు మృతి

నవతెలంగాణ-మరిపెడ

మహబూబాద్ జిల్లా మరిపెడ మండలంలో కుక్కల స్వైరవిహారం పెచ్చరిల్లిపోతోంది. మండలంలో 44 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయ గ్రామాలలో ఎక్కడ చూసిన కుక్కలు సంచరిస్తున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు మహిళలు రోడ్లపై ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. మండలంలో ఇటీవల ఎడ్జర్ల, వీరారం, ఎల్లంపేట, రాంపురం, చిల్లంచర్ల, అబ్బాయిపాలెం గ్రామాలతోపాటు మరిపెడ మున్సిపాలిటీ పట్టణంలో పలు వార్డులలో కుక్కల బెడద తీవ్రమవుతోంది. గత ప్రభుత్వం కుక్కల బెడద నివారిస్తామని చెప్పి విస్మరించిందన్నారు.

ఇటీవల కుక్కల దాడులు విపరీతంగా పెరగడంతో మండలంలోని ఎడ్జెర్ల గ్రామంలో 20 మందిపైగా దాడికి పాల్పడగా అందులో గాయాలపాలై చికిత్స పొందుతూ నాగరాజు, జంగం పులమ్మ మృతి చెందారు. దీంతో ఆ గ్రామం భయంతో వనికి పోతోంది. అధికారులు చేసేదేమీ



లేక చేతులు ఎత్తేయడంతో ప్రజలు బలైపోతున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లా అధికారులు స్పందించి కుక్కల నివారణ చర్యలను వెంటనే తీసుకోవాలని కోరుతున్నారు.

యాంటీ రాబిస్ వ్యాక్షన్స్ వాడాలి : వెటర్ని డాక్టర్ ఎం రమేష్

మరిపెడ మండలంలోని ఇప్పటివరకు మా దగ్గర ఉన్న సమాచారం మేరకు 1500 నుండి 1800 వరకు కుక్కలు ఉన్నట్లు వెటర్ని డాక్టర్ మాలోత్ రమేష్ తెలిపారు. కుక్క కరిచిన వెంటనే గాయాన్ని సబ్బుతో కడగాలని, పశువులు అయితే ఖర్చుల రోజు తప్పనిసరిగా యాంటీ రాబర్స్ వ్యాక్సిన్స్ వేయించుకోవాలని తెలిపారు. ఫస్ట్ డోస్, 3వరోజు, 7వ రోజు, 14వ రోజు, 28వ రోజు, అండ్ 90వ రోజు వాక్సిన్ చేయించుకోవాలని సూచించారు. ఈ వాక్సిన్స్ ప్రభుత్వ దావఖానాల్లో ఉంటుందని తెలిపారు.



నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలి

: కేవీపీఎస్ పట్టణ నాయకులు గంగుల వెంకటేష్

మరిపెడ మున్సిపాలిటీ తోపాటు మండలంలోని వీధి కుక్కల దాడులు విపరీతంగా పెరుగుతున్నాయని వాటి నివారణకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని కేవీపీఎస్ మున్సిపాలిటీ నాయకులు గంగుల వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. రాత్రి వేళల్లో ఒంటరంగా వెళ్లాలంటే కుక్కల బెడద విపరీతంగా ఉందని అన్నారు. పట్టణ కేంద్రంలో ఉన్న పలు చికెన్ సెంటర్ల దుకాణ దారులు జాతీయ రహదారుల వెంట వ్యర్థ పదార్థాలను వేయడం వల్ల కుక్కల బెడద అధికమవుతోందని అన్నారు. గతంలో కుక్కలను కోతులను నివారించిన ప్రభుత్వాలు చేతులు ఎత్తేయడంతో ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుం దన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



నవతెలంగాణ
మహబూబాబాద్
5
సోమవారం ఆగస్టు 05, 2024
www.navatelangana.com

సంక్షిప్త వార్తలు...



జిల్లా వ్యాప్తంగా డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ మాట్లాడారు. డ్రంకన్‌డ్రైవ్ అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అని అధికారులకు సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, పిల్లల తల్లిదండ్రులు వారిపై నిఘా పెట్టాలని అన్నారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనదారులు వాహన పత్రాలు కలిగి ఉండాలని ఎస్పీ తెలిపారు.

'కట్టయ్య'కు ఎమ్మెల్యే మురళినాయక్ పరామర్శ

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం మండల కేంద్రంలోని విలేజ్ కేసముద్రంకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బోళ్ళ కట్టయ్య ఇటీవల తలకు బలమైన గాయం కాగా సర్జరీ చేయించుకుని ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే మురళీనాయక్ సదరు కార్యకర్తను ఆదివారం పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు అంబటి మహేందర్‌రెడ్డి, మండల సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-గూడూరు

మండల పరిధి మదనపురం గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు లింగాల యాదవ రెడ్డి తండ్రి నరసింహారెడ్డి, మరిమిట్ట గ్రామంలో తాటి అనిల్ మృతిచెందారు. ఆదివారం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్ పరామర్శించారు. మండల అధ్యక్షులు చిట్టి వెంకన్న జిల్లా నాయకులు వాంకుడు కొమ్మాలు, మధు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-గార్ల

మండలంలోని మర్రిగూడెం పంచాయతీ పూసల తండాకు చెందిన డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థి భూక్య శివాలాల్ గత నెలలో అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని హన్మకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామర్స్ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ బి ప్రసాద్ పరామర్శించి రూ.20వేల ఆర్థిక సహాయం అందించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు విద్యార్థి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక సహాయం చేయడానికి సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ బలరాంనాయక్‌కు పీసీసీ పదవి ఇవ్వాలి

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండి మౌలానా

నవతెలంగాణ-నెల్లికుదురు

మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడు ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాంనాయక్‌కు పీసీసీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ అధ్యక్షుడు ఎండీ మౌలానా, మండల నాయకుడు కోప్పు శ్రీనివాస్ కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంపీ బలరాంనాయక్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న పార్టీ గెలుపు కోసం గతంలో ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి పదవి చేపట్టిన బలరాంనాయక్‌కు పీసీసీ పదవి ఇవ్వాలన్నారు. మహబూబాద్ పార్లమెంటు అభ్యర్థిగా మళ్లీ గెలవడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో జోష్ ఉందని అన్నారు అధిక నిధులు తీసుకొచ్చి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. వారి వెంట పాక ప్రశాంత్, కందుకూరి శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

సృష్టిలో స్నేహబంధం గొప్పది : సీఐ సంజీవ

నవతెలంగాణ-తొర్రూరు

సృష్టిలో అన్ని బంధాల కంటే స్నేహబంధం ఎంతో గొప్పదని తొర్రూర్ సిఐ సంజీవ, ఎస్సై కూచిపూడి జగదీశ్, లయన్స్ క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ కే రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణం లోని విశ్రాంతి భవనంలో తొర్రూర్ స్నేహ బృందం ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిత్ర బృందం గత 10ఏండ్లకు పైగా అన్ని వర్గాల స్నేహితులతో నిర్వహించడం ప్రశంసనీయం అన్నారు. మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, స్నేహితుల దినోత్సవ కమిటీ కల్లూరి నాగేంద్ర చారి, గోపారపు నాగేశ్వరరావు, దామెర సరేష్, దేవరకొండ క్రిష్ణ ప్రసాద్, శ్రీరామ్ రాజమౌళి, రాగి శ్రీనివాస చారి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మచ్చ సురేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు చిదిరాల నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్... స్నేహితుల దినోత్సవం

నవతెలంగాణ-తొర్రూరు

లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు అధ్యక్షులు లయన్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లయన్స్ సేవా భవనంలో స్నేహితుల దినోత్సవం వేడుకలను నిర్వహించారు. అలాగే లయన్ తమ్మెర వీరభద్రరావు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి గిఫ్ట్‌ను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ కే రాజేందర్‌రెడ్డి, టి లక్ష్మీ నంసింహారావు, టి వెంకట్ రెడ్డి, డాక్టర్ కిరణ్ కుమార్ ,రేగురి వెంకన్న, దామెర సరేష్, పి జెడ్‌సి ప్రతాపని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తమ్మి రమేష్, కోశాధికారి భోనగిరి శంకర్, పూర్వ అధ్యక్షులు విశ్వేశ్వరరావు, మోహన్ రెడ్డి, వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

అట్టహాసంగా ఐజేయూ మండల ప్రథమ మహాసభ

నవతెలంగాణ-గార్ల

జిల్లాలోని వివిధ స్థాయిలలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు నూతన ప్రభుత్వం ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చింతనూరి శ్రీనివాస్ కోరారు. మండలంలోని కృష్ణ తార ఫంక్షన్ హాల్‌లో షోయబుల్లాఖాన్ నగర్‌లో రూపన్ శంకర్ అధ్యక్షతన ఆదివారం జరిగిన టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మండల ప్రథమ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలో ఉన్న ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టులు, వారి సమస్యలు పరిష్కారం కాక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జర్నలిస్టు లకు నూతన కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10లక్షల భీమా సౌకర్యం, ప్రయివేట్ పాఠశాలలో ఉచిత విద్య అందించాలని కోరారు. ముందుగా పత్రిక రంగానికి విశేషంగా కృషి చేసి ప్రాణాలు అర్పించిన షోయాబుల్లా ఖాన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహాసభకు హాజరైన అతిథులను సత్కరించారు. ఈ సమావేశంలో ఎస్సై జీనత్ కుమార్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుండా వెంకటరెడ్డి పాల్గొని ప్రసంగించారు. జిల్లా కార్యదర్శి గాడిపెల్లి శ్రీహరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గంధసిరి రవి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ బుడాన్,సహాయ కార్యదర్శి రావూరి ప్రశాంత్, కౌన్సిల్ సభ్యులు తోడేటి రాము,వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఐజేయూ యూనియన్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మండల నూతన అధ్యక్షుడిగా నేలం శ్రీనివాస్, కార్యదర్శిగా రూపన్ శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలం లోని క్రిష్ణ తార ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన యూనియన్ మండల ప్రథమ మహాసభలో జిల్లా అధ్యక్షులు చింతనూరి శ్రీనివాస్ అధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా కందునూరి ఈశ్వర్ లింగం, వజ్రం నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా తాళ్లూరి కొండల్‌రావు, ఉపాధ్యక్షులుగా దువ్వ సతీష్, యం వెంకటరమణ, కె కృష్ణకుమార్, సహాయ కార్యదర్శులుగా జాన్ ఖాన్, యం శాంతికుమార్, కోశాధికారిగా యం శ్రీకాంత్‌లోపాటు కార్యవర్గ సభ్యులుగా వి. వెంక టేశ్వర్లు, వై రాజశేఖర్, బిరవిశంకర్, పి సురేందర్, జి నరసింహారావు, టి తరుణ్, తదితరులు ఉన్నారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం : ప్రముఖ వైద్యులు రాజేందర్‌రెడ్డి

నవతెలంగాణ-తొర్రూరు



పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమని, రోగ నిరోధక శక్తిని పెంచుతాయని ప్రముఖ వైద్యులు కుందూరు రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రోహిత్ పిల్లల హాస్పిటల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు నవీన్‌కుమార్ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేందర్ రెడ్డి , డాక్టర్ రామ నరసయ్య, డాక్టర్ యాదగిరి రెడ్డి, డాక్టర్ కిరణ్ కుమార్, టి లక్ష్మీనరసింహారావు, వెంకట్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పుట్టిన బిడ్డకు ఒక సంవత్సరం వరకు తల్లి పాలు అందించాలని అన్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన బెస్ట్ బేబీ, బెస్ట్ మధర్‌లకు గిఫ్టులను, స్వీటు, కేకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రేగూరి వెంకన్న, సరేష్, కార్యదర్శి రమేష్, శంకర్, రవీందర్ రెడ్డి, రమేష్ కుమార్, హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : పాలకుర్తి ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నిరంతర కృషి చేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఖానాపురం, సోమారపుకుంటతండా, చర్లపాలెం గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసి సీసీ రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఎస్‌డిఎఫ్ నిధుల నుండి అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయడానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గతంలో ఎవరూ చేయని విధంగా గ్రామాలలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తూ గాంధీ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ స్వరాజ్యం దిశగా అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ కాకిరాల హరి ప్రసాదరావు, మండల అధ్యక్షులు సుంచు సంతోష్, నియోజకవర్గ సీనియర్ నాయకులు పెదగాని సోమన్న, లింగాల వెంకటనారాయణ గౌడ్, జాటోత్ నెహ్రూ నాయక్, అనుమాండ్ల తిరుపతిరెడ్డి, నిరంజన్ రెడ్డి, మేకల కుమార్, ముద్దం విక్రమ్ రెడ్డి, చీకటి శ్రీధర్, మహబూబ్ రెడ్డి,మండల ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, యూత్ నాయకులు, మహిళ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలి : ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

నవతెలంగాణ-పెద్దవంగర



త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని రామచంద్రు తండా, పెద్దవంగర గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల పనులను, పల్లె దావఖాన ప్రహరీ గోడ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీసు హరికష్ణ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, హమ్య నాయక్, విజయ్ పాల్ రెడ్డి, జాటోత్ నెహ్రు నాయక్, కాకిరాల హరిప్రసాద్, రంగు మురళిగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్ రద్దు కోసం 7న ధర్నా

- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్

నవతెలంగాణ-మహబూబాబాద్

జిల్లా విద్యాశాఖలో అక్రమ డిప్యూటేషన్ రద్దు చేయాలని, అసమర్థ డీఈఓను తొలగించాలని ఈ నెల 7న టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కె యాకూబ్ ఉపాధ్యాయులను కోరారు. ఆదివారం స్థానిక గర్ల్స్ హైస్కూల్‌లో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను యాకూబ్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత డీఈఓ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి వివాదాస్పద వ్యవహారశైలి ప్రదర్శిస్తున్నారని, ఒక ఎస్జీటి ఉపాధ్యాయుడిని అక్రమ డిప్యూటేషన్ ఇచ్చి ఆఫీస్‌లో పనిచేపిస్తున్నారని అన్నారు. అతడి డిప్యూటేషన్ రద్దు చేయాలని ధర్నా నోటీస్ ఇచ్చినట్టు చెప్పారు. అయినా అతడినే దొడ్డిదారిన ఆఫీస్‌లో కొనసాగించుకునేందుకు డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీగా ఏకపక్షంగా నియమించుకోవడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతులలో అనేక అవకతవకలు జరిపి ఉపాధ్యాయులను గందరగోళానికి గురి చేసి అర్హత లేని కొంతమందికి సహకరించారని అన్నారు. సమస్యలన్నీ పరిష్కరించాలని ఈ నెల 7 జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు జిల్లాలోని అన్ని మండలాల నుండి ఉపధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మహబాద్, కురవి మండలాల అధ్యక్షులు జి సంజీవ, ఎం ప్రవీణ్ కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బి హరినాయక్, యు సురేష్, సభ్యులు కుమార్, మైసయ్య, బాబు, లక్ష్మయ్య, ప్రసాద్, బాలరాజు, భరత్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు





తొర్రూరు : ఈనెల 7న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు అందరూ విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఏ మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో తొర్రూరు మండల అధ్యక్షులు నాగమల్లయ్య అధ్యక్షతన ఉపాధ్యాయ ధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. మురళీకృష్ణ హాజరై మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్ రద్దు కోరుతూ, అసమర్థ డీఈవోను తొలగించాలని చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి బిక్షపతి, తొర్రూరు మండల ప్రధాన కార్యదర్శి రఫీ, మండల ఉపాధ్యక్షులు చైతన్య , మండల కార్యదర్శి రాయల్, రంజిత్, యాకుబ్, మీరా, తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు విరాళాలు ఇచ్చి అండగా నిలవాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-గార్ల

కేరళ రాష్ట్రంలో ప్రకృతి ప్రళయానికి మరణించిన వందలాది కుటుంబాలకు, వేలాదిగా నిరాశ్రయులైన బాధితులకు విరివిగా విరాళాలు ఇచ్చి అండగా నిలవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ కోరారు. స్థానిక మంగపతిరావు భవనంలో గడ్డిపాటి రాజారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. స్థానిక 30 పడకల ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అయినా అధికారులు, వైద్యులను నియమించడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. రాంపురం సమీపంలో ఉన్న పాకాల చెక్ డ్యాం పై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టక పోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తెలెత్తున్నాయని అన్నారు.గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుధ్యం లోపించి విషజ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కబ్జాకు గురైన గార్ల పెద్ద చెరువు శిఖం భూములను వెలికితీసి ట్రెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలనలో గృహ జ్యోతి, గ్యాస్ సబ్సిడీ దరఖాస్తులో అధికారుల తప్పిదం కారణంగా నష్టపోయిన లబ్దిదారులకు న్యాయం చేయాలని అన్నారు. పెండింగ్ ఉపాధి హామీ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా, మండల నాయకులు కందునూరి కవితా, భూక్య హరి, ఇమ్మడి గోవింద్, అలవాల సత్యవతి,మల్లెల నాగమణి, అంబటి వీరాస్వామి, తాళ్లపల్లి రమా, భాగం లోకేశ్వరావు, చింత మౌనిక, క్లై బాబు, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 30 సంవత్సరాల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థుల(1993-94బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కేసముద్రం స్టేషన్ అభ్యుదయ మీని ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ ఒకరినొకరు తమ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామడుగు ధర్మచారి, ఇమ్మెడ్డి సురేందర్ రెడ్డి, కమటం శ్రీనివాస్, కట్కూరు శ్రీనివాస్, బోనగిరి శ్రీధర్, సతీష్, కమటం స్వామి, బాలు నాయక్, యాకసాయిలు, కంఠం పెద్ద కుమారస్వామి, హరికృష్ణ, ఆఫ్జల్ జల్లి ఏకాంబరం, శ్రీనివాస్, శంకర్, గోపాల్, సతీష్, సుధాకర్, యాస వెంకట్ రెడ్డి, ఎలబోయిన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నవతెలంగాణ-నెల్లికుదురు

ఇటీవల బదిలీపై వెళ్లిన మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను టీపీటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో జి బాలు అధ్యక్షతన ఆలేరు పీఎస్‌లో ఆదివారం ఘనంగా సన్మానించారు. టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్స్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే స్కావెంజర్స్‌ను నియమించాలని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం లో లేని విధంగా 5డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరచిన విధంగా బకాయిలను ఏక మొత్తంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లికుదురు మండల నోడల్ అధికారి రాందాస్, జిల్లా బాధ్యులు చుంచు శ్రీశైలం, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్, సైదులు పాష, మండల ప్రధాన కార్యదర్శి సంగ శ్రీనివాస్, పద్మావతి ,రవి, ఉదయ్ కిరణ్, సురేష్ , నవీన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



ఏపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-గూడూరు

మండలంలోని ఏపూర్ గ్రామంలో నేషనల్ మెడికోస్ ఆర్గనైజెషన్, శశ్వత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో 200మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ గ్రామస్తులు విషజ్వరాలతో మంచాన పడడంతో గ్రామస్థులు భరత్‌నాయక్ ,వాల్యనంద స్వామి, మాజీ సర్పంచ్ మౌనిక దిలీప్‌నాయక్, ఎన్‌టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బానోతు రామన్ననాయక్ కోరిక మేరకు గ్రామంలో స్వచ్ఛందంగా వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో వళ్యానంద స్వామి, రామన్ననాయక్, సంతోష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్.. ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కేసముద్రం ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ శిబిరం నిర్వహించారు. 70 మందికి మధుమేహం ఉన్నట్టు గుర్తించి వారికి రూ.20,000 విలువైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో లయన్స్ అధ్యక్షులు మామిడి అశోక్, వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్, ట్రెజరర్ లక్కాకుల సత్య నారాయణ, మడిపెద్ద వెంకటేష్, ప్రభాకర్ నల్ల కిరణ్, ఫాస్ట్ జెడ్‌సి చిత్రయాకాంతంగౌడ్, జీజుల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ యూనియన్(సీఐటీయూ) జిల్లా నేత ప్రేమలత మృతి

- సీఐటీయూ, అంగన్‌వాడీల ఘన నివాళి



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం మండలంలోని కొరుకండపల్లి గ్రామానికి చెందిన సీఐటీయూ అనుబంధం అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నేత బీరవెల్లి ప్రేమలత అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. సీఐటీయూ జిల్లా నాయకత్వం, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రాజెక్టు నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి దార స్నేహబిందు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాల్లో పాల్గొనడమే కాకుండా అందరు పోరాటాల్లో మమేకం కావడానికి కృషి చేశారని వివరించారు. ప్రేమలత మృతి అంగన్‌వాడీ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి నిర్వహించే పోరాటాలే ప్రేమలతకు అర్పించే నిజమైన నివాళులని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, మండల కన్వీనర్ జల్లే జయరాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బెస్త సంపూర్ణ, జిల్లా, మండల నాయకులు సరోజ, తిరుపతమ్మ, మంగమ్మ, స్వరూప, అండాలు, సలీమా, రజిని, నిర్మల, యశోద, మల్లికాంబ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కో-కన్వీనర్ గంధసిరి జ్యోతిబసు

నవతెలంగాణ - మరిపెడ



హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ మహబూబా బాద్ జిల్లా కో-కన్వీనర్ గంధసిరి జ్యోతిబసు కోరారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ మరిపెడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సంక్షేమ హాస్టల్ ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జ్యోతిబసు మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు మెస్ చార్జీలు సరిపోక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అం దించడం లేదని ఆరోపించారు. నెల రోజులలో విద్యార్థుల సమస్యలు పరిష్క రించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరేష్, ప్రదీప్, సందీప్, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సై రమేష్‌బాబుకు శుభాకాంక్షలు

నవతెలంగాణ- నెల్లికుదురు

మండల నూతన ఎస్సై చిర్ర రమేష్ బాబును ఆదివారం సీపీఐ(ఎం) మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల కార్యదర్శి పెరుమాండ్ల తిలక్ బాబు, సీఐటీయూ మండల కార్యదర్శి ఈసంపల్లి సైదులు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పెరుమాండ్ల బాబుగౌడ్ పాల్గొని మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు కార్మికులు, కర్షకులు, పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

